ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY








బుధవారం 12 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 125

Wednesday 12 August 2026 | Vol.No 28 Issue No .125

హైదరాబాద్ | Hyderabad

పేజీలు: 12+12 | వెల: రూ.1.00

PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

www.visionandhra.in


## ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

- యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం,
- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ వెల్లడి




హైదరాబాద్,ఆగస్ట్11 : తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నా యని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మిగతా2లో..

## పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి
- మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్,ఆగస్ట్11 : హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం మిగతా2లో..

## గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

- అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్
- అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం



హైదరాబాద్,ఆగస్ట్11 :తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మిగతా2లో..

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

- లోక్‌సభలో విపక్ష ఎంపిల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా
- పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపిల పరస్పర నినాదాలు

మిగతా2లో..




## సగర్వంగా హర్ ఘర్ తిరంగా

### ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ పోస్ట్



న్యూఢిల్లీ,ఆగస్ట్11 : భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీమంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా మిగతా2లో..

# నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
- నెల 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
- సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్
- ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,ఆగస్ట్11 :నిషేధిత ఆస్తుల పిఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ



లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ మిగతా2లో..

## ఎయిడ్స్ రహిత తెలంగాణ లక్ష్యం

- నేడు హైదరాబాద్‌లో అవగాహనా ర్యాలీ
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్,ఆగస్ట్11 : ఎయిడ్స్ రహిత తెలంగాణ తమ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణెళి లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు మిగతా2లో..



## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

- ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- 1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం
- 2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,ఆగస్ట్11 : తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్దిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య మిగతా2లో..

## రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

- త్వరలోనే బండారం బయటపెడతాం,
- సిఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు: కెటిఆర్

హైదరాబాద్,ఆగస్ట్11 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు.సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు.



అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో మిగతా2లో..

## పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

- 15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించేలా చర్యలు,
- జిల్లా మానిటరింగ్ కమిటీలలో రైతులను భాగస్వాములను చేయాలి ,
- కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సరళీకృతం చేయాలి
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు మేలు కలిగేలా చూడాలి ,
- పత్తి రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్లు ,
- సీసీఐ అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్,ఆగస్ట్11 : రాష్ట్రంలో రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో హైద్రాబాద్ లో మంత్రి




తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థలకు మిగతా2లో..

## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

### మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ



హైదరాబాద్,ఆగస్ట్11 : గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో భేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. మిగతా2లో..

## విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

- 132కు చేరిన మృతుల సంఖ్య
- శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం



న్యూఢిల్లీ,ఆగస్ట్11 : కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది. మరో 570 మంది గాయపడ్డారు. మిగతా2లో..

## ప్రజల భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్‌నేషన్ బిల్డింగ్

- అధికారులు, ఉద్యోగులు కూడా భాగస్వామ్యం కావాలి
- వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలి
- వివిధ శాఖల అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు



అమరావతి,ఆగస్ట్11 : ప్రజల భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్‌నేషన్ బిల్డింగ్ సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ మిగతా2లో..

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు

- 15శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర కార్యాచరణ
- ప్రజలపై ధరల భారం పడకుండా చూడాలి
- అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి,ఆగస్ట్11 : సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్రం 15శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించి, ప్రజలపై ధరల భారం పడకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రణాళిక విభాగం సమర్పించిన 2026 జులై ఆర్థిక నివేదికను పరిశీలించిన ఆయన, ప్రతి ప్రభుత్వశాఖ అత్యున్నత లక్ష్యాలను చేరుకునేలా వనరుల సమర్థ నిర్వహణ చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, ఉత్పత్తుల విలువ జోడింపుపై జిల్లా, నియోజక వర్గం, మండలాల వారీగా కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశర చేశారు. నివేదిక ప్రకారం.. 2025-26 రెండో త్రైమాసికంలో 10.7 శాతం, వాస్తవ వృద్ధిరేటులో 9.9 శాతంతో గత



రెండేళ్లుగా జాతీయ సగటు కంటే మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. రంగాల వారీగా వ్యవసాయంలో 13.5 శాతం, పారిశ్రామికంలో 10.6 శాతం, సేవల రంగంలో 9.9 శాతం వృద్ధి నమోదైంది. సాంకేతికత అనుసంధానంతో జీఎస్టీ వసూళ్లు 21శాతం పెరిగి రూ.13,282 కోట్లకు, సాధారణ ఎగుమతులు రూ.16,322 కోట్లకు చేరాయి. వీటితో పాటు ఎస్‌టీపీఐ ఎగుమతులు 32.2శాతం, వాణిజ్య వాహనాల నమోదు 51.6శాతం మేర పెరగ్గా, రూ.2.88 లక్షల కోట్ల మెగా ప్రాజెక్టుల మిగతా2లో..

## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

## సగర్వంగా హర్ ఘర్ తిరంగా

పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోదీ పేర్కొన్నారు.

## ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ పక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ రహిత తెలంగాణ లక్ష్యం

నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించ కుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్.. జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్‌నేషన్ బిల్డింగ్

సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పార్టనర్స్ ఇన్‌నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అంతా భాగస్వామ్యం కావాలని మార్గనిర్దేశర చేశారు. ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలని సీఎం సూచించారు. గుంతలు పడిన రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తమ ప్రభుత్వం మంచి పని చేస్తే ప్రజలు ఇన్‌వాల్వ్ అవుతారనడానికి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన స్పందనే నిదర్శనమని తెలిపారు. అలాగే వాస్తవాలను ప్రజలకు వివరిస్తే... ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తారని.. దీనికి కర్నూలులో డీఎస్సీ-2025 టీచర్లు చేపట్టిన కార్యక్రమమే ప్రత్యక్ష ఉదాహరణ అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో నెలవారీ ఆర్థిక ప్రగతి నివేదికపై సమీక్షించామని అన్నారు. జులైలో 10.70 శాతం వృద్ధిని నమోదు చేయగలిగామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఇప్పటి నుంచి ఎక్కువగా ఉండనుందని చెప్పారు. ఇప్పుడే అసలు సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని.. వీటిని అధిగమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఆక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది నిజమో కాదో అన్నది యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలోహైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లత్రో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. 22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు

పెట్టుబడుల గ్రౌండింగ్‌లో 75.4 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడైంది. ఎల్‌నినో సంక్షోభంలోనూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సానుకూల వృద్ధిని నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రాష్ట్రం 10.7 శాతం వృద్ధిరేటు నమోదు చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో 13.5 శాతం, పారిశ్రామిక రంగంలో 10.6 శాతం, సేవల రంగంలో 9.9 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారులు తెలిపారు. సాధారణ ఎగుమతుల్లో రూ.16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి నమోదైనట్లు వెల్లడించారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ కారణంగా జీఎస్టీ పన్ను వసూళ్లు.. 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరిందన్నారు. రూ.2.88 లక్షల కోట్ల భారీ, మెగా ప్రాజెక్టుల గ్రౌండింగ్, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులతో 73.6 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఎల్‌నినో కారణంగా ఈ సీజన్‌కు రాష్ట్రవ్యాప్తంగా 51.8 శాతం మేర లోటు వర్షపాతం నమోదైందన్నారు. 2023-24లో రియల్ జీఎస్డీపీ 6.5 శాతంగా ఉంటే 2025-26 ఏడాదికి 9.9 శాతానికి పెరిగినట్లు తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా అందుబాటులో ఉన్న వనరుల నిర్వహణ చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. అలాగే, సామాన్య ప్రజలపై అదనపు ధరల భారం పడకుండా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ వృద్ధి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఎల్‌నినో సంక్షోభం నేపథ్యంలో నీటి లభ్యత, ఉత్పత్తుల విలువ జోడింపుపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా ప్రణాళికల విడుదల ద్వారా లక్ష్య సాధన సులువవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

## విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాలీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మానిజాలెస్‌లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలు ఇళ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది. రిమోట్ ప్రాంతాల్లో రహదారులు, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పెరీరా, మానిజాలెస్, ఆర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వైద్య, ప్రభుత్వ విమానాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరోవైపు కొలంబియాకు సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఈక్వెడార్ 47 మంది రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పొందిన శునకాలు, ప్రత్యేక పరికరాలను పంపేందుకు సిద్ధమైంది. ఎల్ సాల్వడార్, మెక్సికోతోపాటు అమెరికా కూడా అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

## రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు.మంగళవారంతెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయి కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి చైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

న్యూఢిల్లీ,ఆగస్ట్11 :పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గందరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను సజావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ పక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. ఈూష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్దిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్దిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్దిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మంది లబ్దిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్దిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. మాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్దిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్దిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్దిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు?3.43 కోట్ల లబ్దిదారులు?ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతో పాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, సంగారెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లాల్లో జరిగే పంపిణీ కార్యక్రమాలను క్రమశిక్షణతో, పారదర్శకంగా, నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

చెడ్డపేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'మనం బతకాలంటే రైతు బతకాలి' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే రైతులలో సన్న చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు పక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు పక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2026-27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన రైతుకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోట్గి÷ చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత సీజన్‌లో 122 కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులకు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతుల ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రాకను క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా పొడిగించాలని చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. పాస్ కిసాన్ యాప్ లో స్లాట్స్ ఓపెన్ చేసే ముందు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేసి, ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుట్ బార్ కోడ్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

# సంపాదకీయం

## ఎవరి కోసం వీరి ఆందోళనలు ?

పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో దిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్‌సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్‌సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్‌సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

## వయసుతో సంబంధం లేకుండా హార్ట్‌ఎటాక్.. రోజువారీ వ్యాయామం చేయకపోవడం, ఒత్తిడి సమస్యల వల్ల వచ్చే ఛాన్స్‌లి విలేకరుల సమావేశం లో కార్డియో వైద్యులు

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 11(విజన్ ఆంధ్ర);- గతంతో పోల్చితే ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా హార్ట్ ఎటాక్ లు వస్తున్నాయని వరంగల్ కార్డియో వైద్యులు డాక్టర్ సంతోష్, డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ షఫీ తదితరులు అన్నారు. ఛాతిలో నొప్పి, చేయి లాగినట్లు అనిపించడం లాంటి లక్షణాలు ఉండగానే వైద్యులను సంప్రదించాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మంగళవారం వరంగల్ హంటర్ రోడ్ లోని మెడికల్ హాస్పిటల్ హెడ్ నమ్రత, ఏజీఎం హరినాథ్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. యాంజియోగ్రఫీ, గుండె రక్తనాళాల్లో బ్లాకేజీలను గుర్తించడంలో దాని ప్రాముఖ్యత, సకాలంలో గుండె పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై నిర్వహించిన ఈ ప్రెస్ మీట్ లో డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ గతంలో 60, 70 ఏండ్ల వయసు వారిలో వచ్చే హార్ట్‌ఎటాక్ లు ప్రస్తుతం 40ఏండ్లలోనే వస్తున్నాయని తెలిపారు. రోజువారీ వ్యాయామం చేయకపోవడం, ఒత్తిడి సమస్యలు హార్ట్‌ఎటాక్ లు వస్తున్నాయని తెలిపారు. బీపీ, షుగర్ లాంటి సమస్యలు ఉన్నవారు రెగ్యులర్ గాహెల్త్ చెకప్ లు చేసుకోవడం మంచిదని సూచించారు. షుగర్, బీపీలు ఉన్న వారికి , గతంలో తల్లిదండ్రులకు గుండె సమస్యలు ఉంటే వారి పిల్లలకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. పరీక్షల ద్వారా గుర్తించి యాంజియోగ్రామ్ చేయవచ్చని అన్నారు. సమస్య ఎక్కువగా ఉంటే సర్జరీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత ఎటాక్ లు ఎక్కువ మందిలో వస్తున్నాయని చెప్పారు. మెడికవర్ ఆస్పత్రిలో అత్యాధునిక గుండె వైద్య చికిత్స లు అందుబాటులో ఉందని తెలిపారు. 30ఏండ్ల లోపు వారికి కూడా స్టెంట్ లు వేసిన సందర్భాలు..ఇటీవల కాలంలో 30ఏండ్ల లోపు వారికి కూడా స్టెంట్ లు వేసిన సందర్భాలు ఉన్నాయని డాక్టర్ శ్రవణ్ కుమార్ అన్నారు. ఛాతి నొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు లాంటివి హార్ట్ ఎటాక్ కు లక్షణాలు అని పేర్కొన్నారు. గుండెల్లో బ్లాక్ లు ఉన్నప్పుడు ఆంజియోగ్రామ్ పరీక్ష చేస్తామని తెలిపారు. తద్వారా ఆపరేషన్ అవసరమా లేదా అనేది గుర్తిస్తామని పేర్కొన్నారు. రెగ్యులర్ గా వ్యాయామం చేసే కొంతమంది లోనూ గుండెపోటులు కలవరపెడుతున్నాయన్నారు. ముందు జాగ్రత్తలు పాటించడంలో భాగంగా ఆహార పద్ధతుల్లో మార్పులు చేసుకోవడం మంచిదని చెప్పారు. ఒత్తిడిని తగ్గించుకోవాలని, ముందస్తు జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. కొన్నిసార్లు ఈసీజీ, 2డీ ఈకో పరీక్షల్లోనూ బయటపడదు.. కొంతమందిలో ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలలోనూ హార్ట్ సమస్యలు బయటపడవని డాక్టర్ షఫీ అన్నారు. రక్త నాలాల్లో బ్లాక్ లు ఉంటే ఆంజియోగ్రాం చేస్తామని తెలిపారు. గుండె నాళాల్లో 70శాతం బ్లాక్ లు ఉంటే ప్రమాదమని చెప్పారు. నాళాల్లో బ్లాక్ లు ఉన్నప్పుడే గుండెపోటు లక్షణాలు కనిపిస్తాయన్నారు. సాధారణంగా 30శాతం మందిలో ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు నార్మల్ గా ఉన్నప్పటికీ సమస్యలు ఉంటాయని పేర్కొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11:(విజన్ ఆంధ్ర ) ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గమనించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ఆలోచించుకోవాలని అన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు, ఆరుతడి పంటలు సాగు చేసి రైతులు అధిక దిగుబడులతోపాటు లాభాలు పొందాలని కోరారు.

## ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ గ సమావేశమైన టీపీసీసీ

ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ గ సమావేశమైన టీపీసీసీ: ఉపాధ్యక్షులు,కూకట్పల్లి పార్టీ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): అధిష్టానం పిలుపు మేరకు బండి రమేష్ గాంధీభవన్ లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి గంప వేణుగోపాల్ గార్లతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా జరిగిన సర్ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ కీలకంగా వ్యవహరించిందని,ముఖ్యంగా కూకట్పల్లి నియోజకవర్గంలో బూత్ వారీగా బిఎల్ ఏ లను నియమించి సక్సెస్ చేశామని, సావంత్ గారికి వివరించారు.ప్రజలకు దగ్గర కావడానికి, దొంగ ఓట్లను గుర్తించడానికి బి ఎల్ ఏ, వ్యవస్థ బాగా ఉపయోగపడిందని బండి రమేష్ చెబుతూ, కూకట్పల్లి సర్ ప్రక్రియ విషయాలను సచిన్ తో పంచుకున్నారు . టీపీసీసీ



ఉపాధ్యక్షుడిగా, జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ , ప్రభుత్వ పథకాలు అర్హులకు అందే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు, రానున్న కార్పొరేషన్ ఎన్నికలకోసం సిద్ధంగా ఉన్నట్లు సచిన్ సావంత్ గారికి నివేదికలు అందించారు.

## సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వరంగల్ సిపి శ్వేతతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) పరకాలలో ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం పరకాలలో సీఎం పర్యటన నేపథ్యంలో ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రతిపాదిత హెలిప్యాడ్ కోసం లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలాన్ని, సభా వేదిక, వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాలను పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, సీఎం పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, ఆసుపత్రి ప్రారంభోత్సవం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి



చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, సీఎం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హెలిప్యాడ్, రూట్ మ్యాప్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన భద్రతా ప్రణాళిక అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారుఅనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రణాళికపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సురేష్ బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్,ఏసీపీ సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సర్పంచులు చూడాలి

### అలంపూర్ మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా రఫీ ఏఐసిసి కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్

అలంపూర్ ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) అలంపూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులతో అలంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అలంపూర్ మండలంలో నెలకొన్న వివిధ సమస్యలు, గ్రామాల అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ సూచించారు.అనంతరం అలంపూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ర్యాలంపాడు సర్పంచ్ రఫీని సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన



అధ్యక్షుడు రఫీకి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ అభినందనలు తెలిపారు.అందరూ కలిసికట్టుగా, సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డాక్టర్.ఎస్.ఏ. సంపత్ కుమార్ సూచించారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అలంపూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు పాల్గొని మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్

### ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11,(విజన్ ఆంధ్ర)మంచిర్యాల జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య ప్రారంభించారు. ఈ పోటిల్లో గ్రీన్ జట్టు, ఎల్లో జట్టు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి వీరయ్య మాట్లాడుతూ న్యాయవాదుల మధ్య స్నేహభావం, క్రీడా పోటీలను పెంపొందించడం కోసం ఈ పోటీలు ఎంతగానో దోహద పడుతాయన్నారు. అంతేకాకుండా మానసిక ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. కాగా రెండు జట్ల మధ్య జరిగిన ఈ పోరులో ఎల్లో జట్టుపై గ్రీన్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, గడ్డం శ్రీనివాస్, చుంచు సాధానందం, సురేంద్ర ఉపాధ్యాయ, విశాంత్ గాంధీ, తుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. జిల్లా కలెక్టర్ కె హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11: (విజన్ ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా ఏర్పాటు చేశామని, ఎక్కడైనా అక్రమంగా తరలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## కొత్తగడి టిఎస్ డబ్ల్యూఆర్ఎస్ ఆకస్మిక తనిఖీ

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 06 (విజన్ ఆంధ్ర) : వికారాబాద్ జిల్లా కొత్తగడి టిఎస్ డబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, పలువురు విద్యార్థులు టీసీలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయడం లేదా ఇతర విద్యాసంస్థలకు వెళ్లే పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయో సమగ్రంగా సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, డ్రాపౌట్‌లు, టీసీల జారీకి సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు . విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, వసతి, భోజనం తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిర్యాదులకు కారణమైన అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, హాస్టల్, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి, మెనూ ప్రకారం భోజనం ఉండాలని,భోజన నాణ్యతపై ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు ప్రతి విద్యార్థినికి అందేలా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంటర్ రెండవ సంవత్సరశీ చదువుతున్న విద్యార్థులకు లెక్చరర్ గా మారి లెక్కలు బోధించి వారితో సమాధానాలు చెప్పించారు. పాఠశాలలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, కళాశాల ప్రిన్సిపాల్ సాయి లత, ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ టెక్నాలజీ కారిడార్‌లో ఆలివ్ హాస్పిటాలిటీ ప్రారంభం

హైదరాబాద్, ఆగస్ట్ 11 (విజన్ ఆంధ్ర): ఎంబసీ గ్రూప్‌కు చెందిన హాస్పిటాలిటీ విభాగం ఆలివ్ హాస్పిటాలిటీ హైదరాబాద్ హైటెక్ సిటీలో 61 గదులతో కూడిన 'ఆలివ్ హోటల్ హై-టెక్ సిటీ'ని ప్రారంభించినట్లు ఆలివ్ హాస్పిటాలిటీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ కహ్రామన్ యిగిత్మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఈ హోటల్‌ను ప్రధానంగా కార్పొరేట్ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలోని అత్యంత చైతన్యవంతమైన వ్యాపార, సాంకేతిక కేంద్రాల్లో హైదరాబాద్ ఒకటని అన్నారు. హైటెక్ సిటీలో కొత్త హోటల్ ప్రారంభించడం ద్వారా కార్పొరేట్ డిమాండ్ అధికంగా ఉన్న మార్కెట్లలో తమ సేవలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. అతిథులు, యజమానులకు దీర్ఘకాలిక విలువను అందించే నాణ్యమైన హోటళ్ల అభివృద్ధిపైనే తమ దృష్టి ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, విశాఖపట్నం, గురుగ్రామ్‌లలో ఇటీవల నాలుగు కొత్త హోటళ్లను ప్రారంభించి, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 24 నగరాల్లో 142 ఆస్తులను నిర్వహిస్తోందన్నారు. వీటిలో మొత్తం 5,516 గదులు ఉన్నాయని వెల్లడించారు.

## గ్రామాభివృద్ధి ప్రణాళికకు దరఖాస్తుల ఆహ్వానం




వరంగల్ జిల్లా ప్రతినిధి11(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపిడిపీ)లో భాగంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సర్పంచ్ చీదురు శంకర్, పంచాయతీ కార్యదర్శి రఘు తెలిపారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ కాల్వలు, విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ భూములకు వెళ్లే రహదారులు తదితర మౌలిక వసతుల అవసరాలపై ప్రజలు తమ అభ్యర్థనలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభివృద్ధి పనులు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చనున్నట్లు వారు తెలిపారు. సంబంధిత పనులు అవసరమైన గ్రామ ప్రజలు ఈ నెల 15వ తేదీలోపు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రజల అవసరాలను ప్రణాళికలో పొందుపరిచి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్, కార్యదర్శి తెలిపారు.

### ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న పశువుల దవాఖాన
### 10 దాటినా విధులకు రాని పశువుల వైద్యుడు..
### అటెండర్‌తోనే ఆస్పత్రి నిర్వహణ?



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు11(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లా కేంద్రంలోని వర్ధన్నపేట మండలంలో ఇల్లంద గ్రామంలోని పశువుల దవాఖానలో వైద్య సేవలు అందడం లేదని రైతులు, గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల వైద్యుడు రెండు నెలలుగా సకాలంలో విధులకు హాజరు కావడం లేదని ఆరోపిస్తున్నారు. ఉదయం 10 గంటలు దాటినా వైద్యుడి కుర్చీ ఖాళీగానే ఉంటోందని, అటెండర్‌తోనే దవాఖాన నిర్వహిస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు.ప్రతిరోజూ ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో వైద్యుడు వచ్చి వెళ్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వైద్యుడు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉందని, కనీసం ఫోన్ నంబర్ కూడా దవాఖాన తలుపుపై అందుబాటులో ఉంచలేదని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య పశువులకు వైద్యం చేయించేందుకు వచ్చే రైతులు, గొర్రెల కాపరులు వైద్యుడి కోసం ఎదురుచూసి నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారని తెలిపారు. జిల్లా అధికారులు పశువుల దవాఖానాలపై పర్యవేక్షణ పెంచి, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## పర్వతగిరి గ్రామంలో బోనాల పండుగకు ఏర్పాట్లు

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు11(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి గ్రామంలో ఈ నెల 16వ తేదీ ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏర్పాట్లు చేపట్టింది. సర్పంచ్ చీదురు శంకర్ ఆధ్వర్యంలో పండుగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించి, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణతో పాటు భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేయాలని సర్పంచ్ చీదురు శంకర్, పాలకవర్గ సభ్యులు కోరారు.

### గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 విజన్ ఆంధ్ర)ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు (ల్యాబ్స్), లైబ్రరీ, విద్యార్థుల వసతులను ఆయన నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక సదుపాయాల గురించి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు భవనంలో అరకొర వసతుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అద్దె భవనంలో విద్యార్థులకు ఎలాంటి తాగునీరు, పారిశుధ్యం లేదా ఇతర మౌలిక సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాల సొంత భవన నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం చేయండి

### 15న ఘనంగా.. పకడ్బందీగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అధికారులతో సమీక్షలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ కీలక ఆదేశాలు



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 11(విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితెతో కలిసి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా ఆవిష్కరణ, వేదిక, గ్రౌండ్ తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అద్దం పట్టేలా స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కలిగేలా ప్రదర్శించాలన్నారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతిపాదనలు నిర్ణీత గడువులోగా సమర్పించాలని తెలిపారు. ముఖ్య అతిథి ప్రసంగం కోసం జిల్లాలోని వివిధ శాఖలు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని సూచించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులు వేడుకలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి ప్రభుత్వ శాఖ తమ కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడతో పాటు జిల్లా స్థాయి వేడుకలకు అధికారులు, సిబ్బంది హాజరయ్యేలా చూడాలన్నారు. వేడుకల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని, వేడుకలకు హాజరయ్యే వారికి తాగునీటి వసతి కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబుతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కల్లెడలో ఆగస్టు 23న చెస్ టోర్నమెంట్ రూ.72 వేల వరకు నగదు బహుమతులు పాల్గొనే ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు11(విజన్ ఆంధ్ర);-చెస్ నెట్‌వర్క్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్డిఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో కల్లెడ చెస్ టోర్నమెంట్ 2026ను ఈ నెల 23వ తేదీ ఆదివారం కల్లెడలోని ఆర్డిఎఫ్ వనిత అచ్యుత పై జూనియర్ కాలేజ్, పర్వతగిరి మండలం, వరంగల్ జిల్లాలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాత వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలురు, బాలికలు పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని తెలిపారు. విజేతలకు రూ. 72,000/- వరకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందించడంతో పాటు, పాల్గొనే ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. విద్యార్థుల్లో చెస్‌పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి నైపుణ్యాలను పరీక్షించుకోవడానికి, పోటీ అనుభవాన్ని సంపాదించడానికి, ఇతర చెస్ క్రీడాకారులతో పరిచయాలు ఏర్పరుచుకోవడానికి ఈ టోర్నమెంట్ ఒక మంచి వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9866092628 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## పాత హత్య కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడు అరెస్ట్

మల్కాజిగిరి, ఆగస్ట్ 11,(విజన్ ఆంధ్ర): పాత హత్య కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడిని నేరేడ్‌మెట్ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో ముందు హాజరుపరిచారు. నేరేడ్‌మెట్ ఎస్ హెచ్ ఓఎ. వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాహీన్‌గంజ్, జుమ్మెరాత్ బజార్ ప్రాంతానికి చెందిన కె. రమేష్ (36), మెకానిక్.నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో 2009లో నమోదైన ఓ పాత హత్య కేసులో ఇతడు నిందితుడు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి నాన్ బెయిల్బల్ వారెంట్ జారీ చేసింది. కాగా, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టిన నేరేడ్‌మెట్ పోలీసులు మంగళవారం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం మల్కాజిగిరి కోర్ట్ కు తరలించారు. పరారీలో ఉన్న ఈ నిందితుడిని గుర్తించి కోర్టు ముందు హాజరుపరిచిన నేరేడ్‌మెట్ పోలీసుల కృషిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా కొనియాడారు.


# దేశంలో బీజేపీని గద్దె దింపే వరకు సిపిఐ పోరు

### డిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి
### సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి
### హనుమకొండలో సిపిఐ ప్రదర్శన,పాదయాత్ర ముగింపు




హనుమకొండ జిల్లా ప్రతినిధి 11 ( విజన్ ఆంధ్ర) : దేశంలోని ప్రజా వ్యతిరేక బీజేపీ పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించేందుకే సిపిఐ పోరాటం కొనసాగిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వెయ్యి స్థంబాల దేవాలయం నుండి ఈ ప్రదర్శన హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్ గార్డెన్ వరకు కొనసాగింది. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు దేశంలో మార్పు కోసం ఆగష్టు 6న జిల్లాలో ప్రారంభమైన పాదయాత్ర వారం రోజులుగా జిల్లాలో కొనసాగిన మంగళవారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలే దాని పతనానికి దారి తీస్తాయని అన్నారు. దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని అన్నారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని చేయలేక పోయిందని, ధరలను అరికట్టడంలో, ఉద్యోగాల కల్పనలో విఫలమైందని అన్నారు. మహిళా రిజర్వేషన్ విషయంలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా దానికి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును జోడించి ఆమోదింపజేసుకోవడానికి కుట్ర పన్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలు అనేక మార్లు లీక్ అయి లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీస్తుందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యము చేసి కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని, ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ మిత్రులు అదానీ, అంబానీ లకు కట్టబెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై, మహిళలపై అకృత్యాలు, దాడులు పెరిగాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకై ఆగష్టు 6 నుండి దేశవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలో దేశంలో మార్పు కోసం మహా ర్యాలీతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి,సీనియర్ రాష్ట్ర నాయకులు టి. వెంకట్రాములు, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, ఎన్ ఎ స్టాలిన్, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం,బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి,ఏదునూరి వెంకట్రాజం,వేల్పుల సారంగపాణి, నేదునూరి రాజమౌళి,నకీర్త ఓదెలు,యేషబోయిన శ్రీనివాస్,మాలోతు శంకర్,మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి,శనిగరపు రాజ్ కుమార్,కొట్టె వెంకటేష్,ఉట్కూరి ప్రవీణ్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్,రమేష్, డి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటు ముప్పు తప్పించేది సకాలంలో చేసే యాంజియోగ్రఫీ పరీక్షే
### మెడికవర్ వైద్య నిపుణులు డా. సంతోష్, డా. శ్రవణ్, డా. షఫీ




ఎహన్మకొండ జిల్లా ప్రతినిధి , ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర ) : గుండె రక్తనాళాల్లోని బ్లాకేజీలను ప్రారంభ దశలోనే గుర్తించి, ప్రాణాపాయం నుంచి కాపాడటంలో యాంజియోగ్రఫీ పరీక్ష ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ హాస్పిటల్స్ కార్డియాలజీ నిపుణులు పేర్కొన్నారు. వరంగల్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో యాంజియోగ్రఫీ ప్రాముఖ్యత, గుండె ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా. సంతోష్, డా. శ్రవణ్, డా. షఫీ పాల్గొని మాట్లాడారు.ఎలక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ఎప్రధాన లక్షణాలు, ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధికంగా చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే కార్డియాలజిస్టును సంప్రదించాలి.ఎనిర్ధారణ పద్ధతి, రోగి ఆరోగ్య పరిస్థితి, లక్షణాలు, వైద్య చరిత్ర, ప్రాథమిక పరీక్షల ఆధారంగా యాంజియోగ్రఫీ అవసరమా లేదా అనేది వైద్యులు నిర్ణయిస్తారు.ఎలక్షణాలు లేకపోయినా ప్రమాదం ఉండవచ్చు!ఎకొన్నిసార్లు తీవ్రమైన బ్లాకేజీలు ఉన్నప్పటికీ బయటకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చని వైద్యులు హెచ్చరించారు.ఎప్రమాద కారకాలు, మధుమేహం, అధిక రక్తపోటు (బీపీ), అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, ధూమపానం మరియు కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.ఎముందస్తు జాగ్రత్తలు, క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవడం ద్వారా దాగి ఉన్న సమగ్ర సమస్యలను ముందే గుర్తించి సురక్షితమైన చికిత్స పొందవచ్చును. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితమైన నిర్ధారణ, సమయానుకూల చికిత్సలు మెడికవర్ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్నాయని నిపుణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ నమ్రత, ఆసుపత్రి సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.


## జిమ్‌క్విన్-2026 ఓవరాల్ ఛాంపియన్‌గా గాడియం స్కూల్



హైదరాబాద్, ఆగస్ట్ 11 (విజన్ ఆంధ్ర) : ది గాడియం స్కూల్‌లో అరబిందో ఫార్మా ఫౌండేషన్, గావోఫీ సహకరంతో నిర్వహించిన 'జిమ్‌క్విన్ -2026' జాతీయ స్థాయి రిథమిక్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో గాడియం స్కూల్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందని స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కె.కీర్తి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ 15 రాష్ట్రాల నుంచి 1,200 మందికి పైగా పాల్గొనగా, గాడియం స్కూల్ 472, జిమ్నోరా 273, హైఫ్లయర్స్ జిమ్నాస్టిక్స్ అకాడమీ 246 పతకాలు సాధించాయని తెలిపారు. ఎంపీ రఘునందన్ రావు, బ్యాడ్మింటన్ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, షీ టీమ్స్ డీసీపీ శిరీష రాఘవేంద్ర పాల్గొన్న ఈ ముగింపు కార్యక్రమంలో అంతర్జాతీయ జడ్జి, ఏజీయూ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ టెక్నికల్ కమిటీ అధ్యక్షురాలు రీమా కిజిల్గన్ బహుమతులు అందజేసినట్లు చెప్పారు.

# కిట్స్ వరంగల్ లో 3 అంశం ల పై నిపుణుల ప్రసంగము విజయవంతం

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర)డీన్ అకడమిక్ అఫైర్స్ కార్యాలయం, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్, వరంగల్ (కిట్స్‌డబ్ల్యు) ఆధ్వర్యం లో 2026-27 విద్యా సంవత్సరానికి కొత్తగా చేరిన బి. టెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ (యస్ ఇ పి) మూడు ఇంటరాక్టివ్ ప్రాక్టికల్ సెషన్లను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలు కళాశాలలోని ఆడిటోరియం, సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్, న్యూ సెమినార్ హాల్, మెకానికల్ సెమినార్ హాల్ మరియు సివిల్ సెమినార్ హాల్ అనే ఐదు వేదికలలో జరిగాయి. ఈ ాఞా కార్యక్రమం 2026 ఆగస్టు 11 నుండి 14 వరకు నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా కిట్స్ వరంగల్ 2014-18 బ్యాచ్ పూర్వ విద్యార్థి మరియు మైక్రాన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (హైదరాబాద్) గ్రాఫిక్స్ ఆర్కిటెక్ట్ అయిన కె. హరీశ్వర్ రెడ్డి, "ప్రథమ సంవత్సరం నుండి పరిశ్రమ వరకు: మీ ప్రయాణం ఇప్పుడే మొదలవుతుంది" అనే అంశంపై ఒక సెషన్‌ను విజయవంతం గా నిర్వహించారు, ప్రసంగించారు. అలాగే, రెండవ అతిథి వక్తగా విచ్చేసిన ఎన్ఐటీ వరంగల్ కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. ఆనంద్ కిషోర్, "సార్వత్రిక మానవ విలువలు - వ్యక్తి, సమాజం మరియు సుస్థిర జీవనం" అనే అంశంపై ప్రసంగించారు. పోరాటం, విజయం మరియు సంతోషం అనేవి మన జీవితంలో అంతర్భాగం నొక్కి చెప్పారు. అతిథిగా విచ్చేసిన మరో అతిథి వక్త, వరంగల్‌కు



చెందిన ప్రముఖ మనస్తత్వవేత్త బారుపాటి గోపి, విలువలు, సానుకూల దృక్పథం, ఏకాగ్రత, భయం, ఒత్తిడి నిర్వహణ, సర్దుబాటు, స్వీకరించే గుణం, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, నిబద్ధత, ధైర్యం, పరస్పర సంబంధ నైపుణ్యాలు, సంఘర్షణ నిర్వహణ, వైవిధ్య నిర్వహణ, మానసిక స్థితి నిర్వహణ, ఆకాంక్షల నిర్వహణ, తల్లిదండ్రుల మాటలను అంగీకరించడం వంటి అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. భయమే అతిపెద్ద శత్రువు అని వ్యాఖ్యలు సర్వసాధారణం, కానీ మన జీవిత సృష్టి చాలా అందమైనది. ప్రతి రోజూ ఉత్తమమైన రోజు ఉందని నిర్ధారించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ, విద్యార్థి భవిష్యత్ కెరీర్‌కు ఉత్తమమైన విధానాలను ఆచరించి, అమలు చేయాలని సూచించారు. ప్రస్తుత యువత మెజారిటీ వారు తమ కెరీర్ అవకాశాల గురించి నమ్మకంగా, ప్రతిష్టాత్మకంగా మరియు సాధన-ఆధారితంగా, వాస్తవికంగా ఉన్నారు. అద్దే విద్యార్థుల విజయానికి కీలకం అని ప్రిన్సిపాల్ సగర్వంగా తెలిపారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, ఫార్మర్ రాజ్య సభ ఎం.పి., కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు గారు, కోశాధికారి పి.నారాయణరెడ్డి గారు & హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే & కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రెటరీ, వి. సతీష్ కుమార్ గారు బి. టెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల భవిష్యత్తు కోసం నిర్వహించినందుకు టీచింగ్ & టీచింగ్ యేతర సిబ్బంది ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ ఎస్. నరసింహ రెడ్డి, విభాగాదీపతులు, వివిధ విభాగాల డీన్స్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు & డా. హెచ్. రమేష్ బాబు, డాక్టర్ కె. శివశంకర్, డీన్ ఎస్ఎ, ప్రొఫెసర్ కె. శ్రీధర్, అకడమిక్ వ్యవహారాల ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్‌లు డాక్టర్ పి. నాగార్జున రెడ్డి, డాక్టర్ , డాక్టర్ ఆర్. శ్రీకాంత్ మరియు డాక్టర్ ఆర్. రమేష్, అసోసియేట్ ప్రొఫెసర్ & పిఆర్ఓ, డా. డి.ప్రభాకరా చారి, సుమారు 1200 మంది విద్యార్థులు 3 వరుస సెషన్లలో కిట్స్‌డబ్ల్యు క్యాంపస్‌లోని ఐదు వేదికల వద్ద టీచింగ్ & టీచింగ్ యేతర సిబ్బంది మరియు విద్యార్థి ప్రతినిధులు: హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

హనుమకొండ కేడీసీలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర)రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. మంగళవారం హనుమకొండ లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం ( ఐ సి ఓ పి ), ఫోటో ఎగ్జిబిషన్ ను పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా సీబీసీ రూపొందించిన జాతీయ పతాకం యొక్క ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పై ఫోటో ఎగ్జిబిషన్‌లోని అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు. మన రాజ్యాంగంలో రాసుకున్న హక్కులు, బాధ్యతలు వివిధ ఉన్నాయో పౌరులుగా మన బాధ్యత ఏంటి అనేది ఇలాంటి కార్యక్రమాలు మనకి గుర్తు చేస్తాయన్నారు. ఎప్పుడూ మనం హక్కుల కోసం పోరాడదం అనేది ఒక నాణేనికి ఒక వైపు మాత్రమే. ఇంకోవైపు మన బాధ్యత ఏమిటి అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. మనకి దక్కిన స్వాతంత్ర్యానికి మనం గౌరవం, విలువ ఇస్తూ, భవిష్యత్తు తరాలకి ఎటువంటి సమాజాన్ని అందిస్తామో అనేది మనపైనే ఆధార పడి ఉంటుందన్నారు. దేశాభివృద్ధి, భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు. మిమ్మల్ని మీరు ఎలా మలుచుకుంటారు అనేది మీ చేతుల్లోనే ఉంటుందని యువతను ఉద్దేశించి అన్నారు. మీ జీవితాలు మీరు ఎలా మలుచుకుంటారు అనేది వందకి వంద శాతం మీ చేతుల్లోనే ఉంటుందని, కష్టపడి మన జీవితాన్ని మనమే మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అలాగే క్విజ్, వక్తృత్వ వ్యాసరచన పోటీలలో విద్యార్థులు చాలామంది ఉత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు, పోరాటాల జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టం అని అన్నారు. ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన గొప్ప అవకాశమని తెలిపారు. మన రాజ్యాంగాన్ని పొందడం మన అదృష్టం అని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు మనకు ఉన్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన, జనవరి 26వ తేదీన ఎంతో ఘనంగా జరుపుకుంటామని, ఇలాంటి కార్యక్రమాలను కూడా ప్రతి సంవత్సరం స్వాతంత్ర్యం వెనుక ఎంతటి కృషి, త్యాగం, పోరాటం దాగి ఉందో మనం ఎప్పటికీ మరచిపోకూడదనే ఉద్దేశంతో నిర్వహిస్తుంటామని అన్నారు. మనం ఈరోజు చూస్తున్న జాతీయ పతాకం ఒక్క రోజులో రూపుదిద్దుకున్నది కాదు అని దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి, ఎన్నో పోరాటాలు ఉన్నాయని తెలిపారు. మనం పొందిన స్వేచ్ఛను, మనకు లభించిన ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంతో కృతజ్ఞతతో గుర్తుంచుకోవాలని అన్నారు. మనకు లభించిన ఈ స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు, భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు మన వంతు కృషి చేయాలన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' పై పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. విద్యార్థులలో దేశం పట్ల బాధ్యత పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమం లో కళా బృందాలు 'హర్ ఘర్ తిరంగా' పై ప్రదర్శించిన యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత,ప్రోగ్రామ్ ఇన్చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ స్టేజ్ వద్ద ఆర్టీసీ బస్సులు తప్పనిసరిగా ఆపాలి

## విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలి: గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్



దుబ్బాక విజన్ ఆంధ్ర దుబ్బాక, ఆగస్టు 11: తిమ్మాపూర్ గ్రామ బస్ స్టేజీ వద్ద పాఠశాల, కళాశాల విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సులను తప్పనిసరిగా ఆపేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్, దుబ్బాక మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ గుర్రాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ డిపో మేనేజర్లకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మెదక్ ‑ సిద్దిపేట ప్రధాన రహదారిపై ఉన్న తిమ్మాపూర్ బస్ స్టేజ్ వద్ద గత కొన్ని రోజులుగా కొన్ని ఆర్టీసీ బస్సులు సక్రమంగా ఆగకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తిమ్మాపూర్ నుంచి సిద్దిపేట, దుబ్బాక పట్టణాలకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు ఆపకపోవడంతో సమయానికి విద్యాసంస్థలకు చేరుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చి, బస్సులు స్టేజీ వద్ద ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారని సర్పంచ్ తెలిపారు. తిమ్మాపూర్ బస్ స్టేజ్ ఒక్క గ్రామానికే పరిమితం కాదని, సమీపంలోని పద్మనాభునిపల్లి, కొండాపూర్, పెద్దగుండవెల్లి, వరదరాజుపల్లి, అప్పనపల్లి, గోవర్ధనగిరి తదితర గ్రామాల ప్రజలకు కూడా ఇదే ప్రధాన బస్ స్టేజీ అని వివరించారు. పెద్దగుండవెల్లి గ్రామ ప్రజలు సైతం ఆటోల ద్వారా తిమ్మాపూర్‌కు చేరుకుని ఇక్కడి నుంచి సిద్ధిపేటకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారని తెలిపారు. అదేవిధంగా ఉపాధి కోసం ప్రతిరోజూ వందలాది మంది కార్మికులు ఉదయం తిమ్మాపూర్ బస్ స్టేజీ నుంచి సిద్ధిపేటకు వెళ్లి, సాయంత్రం తిరిగి వస్తుంటారని చెప్పారు. తిమ్మాపూర్ స్టేజీ నుంచి ఆర్టీసీకి గణనీయమైన ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి





వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణకు వరి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి అధికారులకు సూచించారు. మంగళవారం ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణ నిమిత్తం ఏర్పాట్లపై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ. ఖరీఫ్ సీజన్ లో దొడ్డు సన్న రకం వరి ధాన్యం సేకరణ ఉండనున్నట్లు దానికి అనుగుణంగా అదనంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూనికల తో పాటు సంచులను అందుబాటులో ఉంచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గోదాంలు ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఒక ప్రణాళిక పద్ధతి ప్రకారం ముందుకు వెళితే సక్సెస్ అవుతుందన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. ఒక మిల్లుకు 60 మంది హమాలీలు తగ్గకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసా అధికారి కవిత , డి సి ఓ శ్రీనివాస్, అదనపు డి ఆర్ డి ఓ నర్సింలు, డీసీఎంఎస్ రమణారెడ్డి, డిటిసిఎస్ విజయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ప్రతివిద్యార్థికష్టపడిచదివి ఉన్నతలక్ష్యాలనుచేరుకోవాలి





నారాయణపేట, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జాజాపూర్ సర్పంచ్ కాట్రే సంగీత అన్నారు. మంగళవారం నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగాసర్పంచ్ కాట్రే సంగీత మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే బూట్లు, పథకాలను సద్వినియోగం చేసుకోండిరోజూ బడికి రండి, బాగా చదవండి టీచర్లు, తల్లిదండ్రుల మాట వినండి మన గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణించాలన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న ఈ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి. బూట్లు ధరించడం వల్ల ఆరోగ్యం, పరిశుభ్రత మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఆదర్శ కమిటీ చైర్మన్ మణెమ్మ, వార్డు సభ్యురాలు శిరీష, ఉపాధ్యాయ బృందం విజయ మధుసూదన్ భాను ప్రకాష్ మంగళ లక్ష్మణ్ ప్రతాప్ శశిరేఖ నిర్మల శ్రీదేవి నరసింహ నర్సింలు రఘురాంరెడ్డి

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11,(విజన్ ఆంధ్రజిల్లాలో నెల 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, మంచిర్యాల,నస్పూర్ మండలాల తహసిల్దార్ల సంయుక్త ఆధ్వర్యంలో కుర్చీలు, ఇతర ఏర్పాట్లు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథి సందేశం, జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, పుష్పగుచ్చాలు, వేదిక తయారీ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని, వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 11,(విజన్ ఆంధ్ర)ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ– 2026 ప్రక్రియలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ, మార్పులుచేర్పులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 1, 2026 ను అర్హత తేదీగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ‑2026 ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ (ఎస్.సి.), బెల్లంపల్లి (ఎస్.సి.), మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత మార్పులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పేర్ల మార్పు తదితర వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 747 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 18 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం, 22 పోలింగ్ కేంద్రాల స్థానాలను మార్చడం, ఒక పోలింగ్ కేంద్రం పేరును మార్చడం ప్రతిపాదించగా మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 765 కు చేరనుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 230 నుంచి 235, బెల్లంపల్లి నియోజకవర్గంలో 227 నుంచి 231, మంచిర్యాల నియోజకవర్గంలో 290 నుంచి 299 పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగనుందని తెలిపారు. ఎన్నికల సంఘం సవరించిన కార్యాచరణ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితా ఈ నెల 17వ తేదీ ప్రచురించబడుతుందని, ఈ నెల 17 నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని, వాటి పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని, తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 19వ తేదీన ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్. ‑2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పప్పు దినుసు పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ ( పప్పు దినుసుల సాగులో స్వయం సమృద్ధి సాధించడం పై ) వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా





హనుమకొండ:జిల్లా ప్రతినిధి ఆగష్టు 11 (విజన్ ఆంధ్ర) ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా పప్పు దినుసుల పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ని కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ ( పప్పు దినుసుల సాగులో స్వయం సమృద్ధి సాధించడం)పై వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని ఆయా మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు గురించిన వివరాలను మండల వ్యవసాయ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతు బీమా క్లెయిమ్ ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో ఎరువులు విత్తనాల నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా విస్తృత తనిఖీలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతు బీమా క్లెయిమ్ లను త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతు నమోదు( ఫార్మర్ రిజిస్ట్రీ) అందరూ రైతులు నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 87.8 శాతం నమోదు పూర్తయిందని, మిగతా నమోదును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, సహాయ సంచాలకులు ఆదిరెడ్డి, అవినాష్ వర్మ, సాంకేతిక వ్యవసాయ అధికారి కమలాకర్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన వారు చేయూత పెన్షన్ కు దరఖాస్తు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి





వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో చేయూత ఫెన్షన్ పథకము క్రింద అర్హత కలిగినవారిని గుర్తించి ఈ నెల 31 వరకు దరకాస్తుచేసుకోనే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. మంగళవారము వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అన్ని మండలాల ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు, డి ఇ లు , ఎ ఇ లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిభందనల ప్రకారం చేయూత ఫెన్షన్ దరకాస్తులను ఈ నెల 31 వరకు స్వీకరించాలని, మ్యడుల్ ప్రాకారము వెరిఫికేషన్ చేయాలనీ, దరకాస్తు డాటా ఎంట్రి చేయడంలో జాగ్రతలు తీసుకోవాలని, ఎవరు ఏ లాగిన్ లో ఎంట్రి చేశారన్న విషయం రికార్డ్ అవుతున్నందున తోదరపడి డాటా తప్పుగా ఎంట్రి చేయకుండా చూసుకోవాలనిఅధికారులకు ఆదేశించారు. వచ్చిన దరకాస్తులను క్షేత్ర స్థాయి లో వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. మొదటి విడత స్కూల్ యూనిఫార్మ్ ఆయా స్కూల్స్ లో ఇవ్వాలని, పంచాయతి రాజ్ అధ్వర్యంలో జరుగుతున్న పనులను పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని , మండల స్థాయి ప్రజావాణి ఏర్పాటు చేసి దరఖాస్తులను మండల స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పురోగతి, ప్రజావాణి ద్వారా అందుతున్న దరఖాస్తుల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం నిర్దేశించిన ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) తమ పరిధిలోని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

సమావేశములో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జాడ్ పి సి ఇ ఓ సుదీర్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్, పంచాయతి రాజ్ ఇ ఇ ఉమేష్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# వంతెన లేక ఎడ్లబండిపై రోగిని తరలించిన గ్రామస్తులు

దహేగాం, ఆగస్టు 11( విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలోని కొత్మీర్ గ్రామపంచాయతీ పరిధిలోని జెండాగూడ గ్రామంలో వంతెన లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామానికి చెందిన చంద్రసేన్ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన లేకపోవడం, వాగును దాటే వీలు లేకపోవడంతో అంబులెన్స్ గ్రామంలోకి చేరుకోలేకపోయింది. దీంతో గ్రామస్తులు చంద్రసేన్‌ను ఎడ్లబండిపై పడుకోబెట్టి వాగు వరకు తీసుకువచ్చారు. అనంతరం వాగును దాటించి అవతల వేచి ఉన్న అంబులెన్స్‌లో ఎక్కించి కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మరోసారి జెండాగూడ గ్రామంలో వంతెన నిర్మాణం ఎంత అత్యవసరమో స్పష్టం చేసింది. ప్రతి వర్షాకాలంలో గ్రామస్తులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. అత్యవసర వైద్య సేవలు కూడా గ్రామానికి చేరుకోలేని పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి జెండాగూడ గ్రామానికి శాశ్వత వంతెన నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# పోలీసులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి: ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర):ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెంచేలా ప్రతి సిబ్బంది బాధ్యతగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ స్పష్టం చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన ఉట్నూర్ పోలీస్ స్టేషన్ మరియు సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, సీఐ ఎం. ప్రసాద్, ఎస్సై జి. విజయ్ పూలమొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించిన ఎస్పీ, స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్, రికార్డుల నిర్వహణ, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వాహనాల స్థితిగతులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. సిబ్బందితో ప్రత్యేకంగా డ్రిల్ నిర్వహించి, ప్రతి శనివారం పరేడ్ నిర్వహించడం ద్వారా శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలిపారు. వీపీఓ (విలేజ్ పోలీస్ ఆఫీసర్) విధానాన్ని సక్రమంగా అమలు చేస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. వర్టికల్స్ విధానాన్ని అమలు చేస్తూ ఎలాంటి పెండింగ్‌లు లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, కోర్టు సమన్సులు, వారెంట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేసి, ఫింగర్ ప్రింట్ యంత్రాల ద్వారా అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయాలని సూచించారు. గంజాయి, గుడుంబా, గాంబ్లింగ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని హెచ్చరించారు. రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. మండల పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజారక్షణలో పోలీసులు తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. సర్కిల్ పరిధిలోని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సర్కిల్ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, ఉట్నూర్ ఎస్సై జి. విజయ్, ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ. సాయన్న, ఎస్సై చిన్న గంగారం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి:

## వరంగల్ ఎంపీ డా. కడియం కావ్యలి ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లకు త్వరగా అనుమతులివ్వాలి

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11(విజన్ ఆంధ్ర);– జూలాజికల్ పార్కు అభివృద్ధికి కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ నిధులు మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు. హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్కులో సింహాల ఎన్‌క్లోజర్, నైట్ షెల్టర్, హైనా, జాకల్, వైల్డ్‌డాగ్ ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లు, సరీసృపాల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జూ అథారిటీకి సమర్పించిందని ఎంపీ తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు సవరణలు చేసి డిజైన్లు, డ్రాయింగ్‌లు సమర్పించినందున వాటికి త్వరగా ఆమోదం ఇవ్వాలని కోరారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణతో పాటు మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పార్కు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.



కాంపా నిధులను విడుదల చేసి ఈ పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జంతువుల కదలికలు, ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ వాటి సంరక్షణ, భద్రతను పర్యవేక్షించేందుకు వీడియో, ఆడియో రికార్డింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. ఆధునిక పర్యవేక్షణ సదుపాయాలతో జంతువుల సంరక్షణ మరింత సమర్థంగా చేపట్టవచ్చని తెలిపారు. కాకతీయ జూలాజికల్ పార్కును వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తే వరంగల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయని ఎంపీ పేర్కొన్నారు. ఎంపీ డా. కడియం కావ్య చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్ సానుకూలంగా స్పందించారు. కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య వెల్లడించారు.

# మాజీ డీసీసీ అధ్యక్షుడు కె. విశ్వప్రసాద్రావుపై ఆరోపణలు చేసుడు సరికాదు...కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లు

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు11: (విజన్ ఆంధ్ర)06-08-2026 గురువారం రోజున ఆసిఫాబాద్ డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మున్సిపల్ ఎన్నికలు, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా జరిగిన పరిణామాలపై చేసిన నిరాధార ఆరోపణలను మేము ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లుగా తీవ్రంగా ఖండిస్తు మంగళవారం రోజున ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే మాజీ డీసీసీ అధ్యక్షులు కె. విశ్వప్రసాదరావు ఎన్నికల సామగ్రి, ప్రచార రథాలు తదితర ఏర్పాట్లు చేసి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ విజయానికి తన శాయశక్తులా కృషి చేసిన విశ్వప్రసాద్రావు పై ఆరోపణలు చేయడం సముచితం కాదని స్పష్టం చేశారు. ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో ఇండిపెండెంట్ గా గెలిచిన నలుగురు కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలపడానికి కె. విశ్వప్రసాదరావు చేసిన కృషి ఎంతో ముఖ్యమైనది. మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి చైర్మన్ కాకూడదనే ఉద్దేశం ఆయనకు ఉంటే, ఇండిపెండెంట్గా గెలిచిన కౌన్సిలర్ల మద్దతును కాంగ్రెస్ పార్టీకి తీసుకురావడానికి ఎందుకు కృషి చేస్తారని ప్రశ్నిస్తున్నాము. మాజీ ఏఎంసీ చైర్మన్ గడవేని మల్లేష్ మిత్రుడైన అబ్దుల్ రూ.1 కోటి 50 లక్షలు ఖర్చు చేసినప్పటికీ చైర్మన్ పదవి దక్కలేదని పేర్కొనడం శోచనీయం. నిజంగా రూ.1.50 కోట్లు ఖర్చు జరిగి ఉంటే, ఆ డబ్బు ఎవరు ఇచ్చారు? ఎవరు తీసుకున్నారు? ఎక్కడ, ఎప్పుడు, ఎవరి ద్వారా చెల్లించారు? అనే విషయాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాము. ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం పార్టీ ప్రతిష్టకు నష్టం కలిగిస్తుంది. అదేవిధంగా,



ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు ఆత్రం సుగుణ, అజ్మీరా శ్యామ్ నాయక్, కె. విశ్వప్రసాదరావు, ఆత్రం సక్కు తో పాటు సంబంధిత కుటుంబ సభ్యుల ఫోన్ కాల్ డేటాను చట్టపరమైన నిబంధనల ప్రకారం పరిశీలిస్తే, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఎవరు అనుకూలంగా పనిచేశారు, ఎవరు పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించారు అనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మేము కోరుతున్నాము, గుండా శ్యామ్ మరియు ఆయన సతీమణి ఫోన్ కాల్ వివరాలను కూడా చట్టబద్ధంగా పరిశీలిస్తే, చైర్మన్ ఎన్నికల సమయంలో ఎవరెవరు ఎవరితో సంప్రదింపులు జరిపారు, చైర్మన్ ఎన్నికకు ఎవరు అడ్డంకులు సృష్టించారనే వాస్తవాలు బయటపడతాయని పేర్కొంటున్నాము. ఇకనైనా ఒకరిపై ఒకరు నిరాధార ఆరోపణలు చేసుకోవడం మానుకుని, వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకురావాలని కోరుతున్నాము. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త ఐక్యంగా, నిజాయితీగా పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

# ఇందిరా మహిళా శక్తితో మహిళల సాధికారతకు మరింత బలం



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెం దుతుం దని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం గుండ్లసింగారం షిరిడీ సాయి ఫంక్షన్ హాల్లో 2వ డివిజన్ కు చెందిన మహిళలకు ఇందిర మహిళా శక్తి చీరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అనే నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మహిళల అభ్యున్నతీ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళ శక్తితో కుటుంబం అభివృద్ధి సాధిస్తుందని, మహిళలు స్వశక్తితో ఆర్థికంగా పురోగతి సాధించాలని ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి, మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన సింగులాల్, మాజీ మండల అధ్యక్షులు అజయ్, మాజీ డివిజన్ అధ్యక్షులు రవి, పొన్నాల రఘు, వంగపహాడ్ పిఎసిఎస్ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, గ్రంథాలయ మాజీ డైరెక్టర్ సముద్రాల మధు, సీనియర్ నాయకులు అనిల్ రెడ్డి, గాదె రాజయ్య, నామిండ్ల భాస్కర్, ములుగు వంశీ, రేణుకుంట్ల రాజేష్, సునీత, జనరల్ సెక్రెటరీ జీవన్, మండల, డివిజన్ ముఖ్య నాయకులు, నాయకులు కార్యకర్తలు, మహిళలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యువజన పోరు గర్జనకు తరలిరండి: మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర):సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభ ఉద్యమాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలను బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే మానుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న హితవు పలికారు. కమిషన్లపై ఉన్న శ్రద్ధ ఆదిలాబాద్ యువత భవిష్యత్తుపై చూపకపోవడం బాధాకరమన్నారు. ఆదిలాబాద్‌లో సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం కోసం సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మూడో రోజు దీక్షలో పాల్గొన్న యాపల్‌గూడ గ్రామస్తులను, రైతు కుటుంబాలను ఆయన అభినందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం నిర్వహించనున్న 'విద్యార్థి యువజన పోరు గర్జన' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కాసిం హాజరవుతారని, సుమారు 10 వేల మంది విద్యార్థులు, యువత పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు, కూలీలు, మేధావులు, విద్యార్థి, ప్రజా, కుల సంఘాల నాయకులు స్వచ్ఛందంగా తరలివచ్చి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సీసీఐ సాధన సమితి బృందం కేంద్ర మంత్రిని కలిసినప్పుడు పరిశ్రమను పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారని జోగు రామన్న గుర్తుచేశారు. అయితే స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఆ హామీలను పక్కనపెట్టి పరిశ్రమపై వ్యంగ్యంగా మాట్లాడటం ద్వారా యువత ఆశలపై నీళ్లు చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు జీవో పేరుతో సీసీఐ అంశాన్ని తప్పుదోవ పట్టించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభమైతే దాదాపు 80 శాతం స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిసినా, వారు ముందుకు రాకపోవడం ఆశ్చర్యకరమన్నారు. 'జెన్-జెడ్' ఉద్యమం తరహాలో యువతను ఏకం చేసి సీసీఐ సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జోగు రామన్న హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయిస్తే పరిశ్రమ పునఃప్రారంభానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, నారాయణ, ఆలాల్ అజయ్, సలీం, కొండ రమేష్, బొర్రన్న, అన్నమొల్ల కిరణ్, బుట్టి శివ, దాసరి రమేష్, గంద్రత్ రమేష్, చిన్నాన్న, బిళ్ళ రాజ్, బుమయ్యా, కాంతారావు, గంగారాం, ఎస్కే సాఫి, అగ్గిమాళ్ళ రాజేశ్వర్, నర్సింగ్, సింగలపు రామన్న, బుమన్నా, రాంరెడ్డి, రాజలింగు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర):యువత ప్రభుత్వం, ప్రముఖ సంస్థలు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మావల మండల కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (టీసీఎస్) నేతృత్వంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంత అభ్యర్థులు ప్రసిద్ధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి క్యాంపస్ డ్రైవ్‌లు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు లభించిన ప్రతి అవకాశాన్ని వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాల్లో రాణించడానికి అవసరమైన శిక్షణ, మార్గదర్శకాలను జిల్లా యంత్రాంగం నిరంతరం




అందిస్తుందని భరోసానిచ్చారు. జిల్లాలో అందుబాటులో ఉన్న రీజనల్ టాస్క్ స్కిల్లింగ్ సెంటర్ ద్వారా ప్రాథమిక కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి పలు సాంకేతిక నైపుణ్యాలలో శిక్షణ పొందాలని కోరారు. శిక్షణ కావాల్సిన విద్యార్థులు జిల్లా ఉపాధి కల్పనాధికారిని లేదా టాస్క్ మేనేజర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. సీబీఆర్టీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులందరూ హైదరాబాద్‌లో జరిగే టీసీఎస్ ఇంటర్వ్యూలకు తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఉద్యోగంలో చేరిన తర్వాత మొదట అనుభవం సంపాదించి, నైపుణ్యాలను పెంచుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని కలెక్టర్ హితవు పలికారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈ అవకాశాలు వర్తిస్తాయని వెల్లడించారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఐటీఐ విద్యార్థుల కోసం మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని, ఈ సమాచారాన్ని అర్హులైన మిత్రులకు తెలియజేసి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి మిల్కా, టాస్క్ మేనేజర్ సాయి, టీసీఎస్ ప్రతినిధులు శ్రవణ్, సాయి మణికంఠ, శీతల్, కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, అధ్యాపకులు, వివిధ విభాగాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో డీడీ జాదవ్ అంబాజీ ఆకస్మిక తనిఖీ

## భోజనం, ఆరోగ్యం, విద్యపై సమగ్ర పరిశీలన నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు11:(విజన్ ఆంధ్ర) కోమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరిదీ ప్రాంతంలోని మొఘుడ్‌ధగడ్, బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యత, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, విద్యా బోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, వసతి సౌకర్యాలు తదితర అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, భోజనం, విద్యాబోధనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. లిబిఅలాగే పాఠశాల సిబ్బంది, ఏఎన్ఎం విధుల నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి ఆరోగ్యం, భద్రత, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ డైరెక్టర్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో, ఆరోగ్య పరిరక్షణలో లేదా విద్యాబోధనలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సహించేది లేదని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠినమైన చర్యలు తప్పవని జాదవ్ అంబాజీ హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# పాఠశాలల్లో ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర):పాఠశాల విదార్థుల్లో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించేందుకు 'స్పోకెన్ ఇంగ్లీష్' కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్పోకెన్ ఇంగ్లీష్ ప్రోగ్రామ్, అదిలాబాద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లాలోని సుమారు 250 నుంచి 260 పాఠశాలల్లో ఈ స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాబోయే ఆరు నెలల కాలంలో ప్రతినెలా 40 పాఠశాలల చొప్పున ఈ శిక్షణను విస్తరించి, ప్రతి నెల చివరి వారంలో జిల్లా స్థాయిలో 'స్పోకెన్ ఇంగ్లీష్ ఛాంపియన్‌షిప్' పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యార్థులు నలుగురిలో ధైర్యంగా మాట్లాడేలా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. తరగతి గదిలో లేదా వేదికలపై మాట్లాడటానికి వెనుకబడే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అదనపు




సమయాన్ని కేటాయించి ప్రతి ఒక్కరిలోనూ ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించాలని, ఏ ఒక్క విద్యార్థినీ వదిలేయకూడదని స్పష్టం చేశారు. బోధనా ప్రక్రియను సులభతరం చేసేందుకు 'శిక్షా కోపైలట్' వంటి ఆధునిక సాంకేతిక పరికరాలు, మెటీరియల్స్ వీడియోలను వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో కృషి చేసి ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అకడమిక్ కో ఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ కాంగ్రెస్‌లో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నాను



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు11(విజన్ ఆంధ్ర);-గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కృషి చేశానని, పార్టీ అధికారంలో లేని సమయంలోనూ ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని పనిచేశానని జనసేన పార్టీలో చేరిన కరాటే ప్రభాకర్ తెలిపారు. మంగళవారం 34వ డివిజన్ శివనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలుగా మారిందని ప్రభాకర్ ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడికి పదవి ఇచ్చినప్పటికీ కనీస గౌరవం, గుర్తింపు లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తూర్పు నియోజకవర్గంలో వచ్చిన పదవులను 'నీకు ఒకటి.. నాకు ఒకటి' అన్నట్టుగా పంచుకుంటున్నారని ఆరోపించారు. తనను ఎన్నో విధాలుగా ఒత్తిళ్లకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జనసేనలో చేరే అవకాశం ఉందని ప్రభాకర్ తెలిపారు. తాను పవన్ కల్యాణ్ కోసం జనసేనలో చేరలేదని, పేదలకు మంచి చేయాలనే ఆయన ఆలోచనా విధానం నచ్చడంతో పార్టీలో చేరినట్లు చెప్పారు. జనసేన అధిష్ఠానం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా పేద ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తానని ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాటు చేయాలి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ,**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 11( విజన్ ఆంధ్ర ప్రతినిధి): జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో, ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను తిలకించేందుకు వచ్చే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వచ్చే అతిథికి పోలీస్ గౌరవ వందనంతోపాటు, బందోబస్తుల ఏర్పాట్లను చూడాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక, కుర్చీలు, బారికేడింగ్ సీటింగ్ వంటి ఏర్పాట్లు ఆర్ అండ్ బి శాఖ, వేదిక వద్దరంగురంగు పూలతో అలంకరణకు ఉద్యానవన శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. మైక్ సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఐఅండ్ పిఆర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులచే దేశభక్తి ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందచేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలు సిద్దంగా ఉండేలా చూడాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ప్రైవేట్ ఆసుపత్రిలో వరుస తనిఖీలు



సంగారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించిన తనిఖీలలో నివ్వెరపోయే నిజాలు బయటపడ్డాయి పోతిరెడ్డిపల్లి కేబీఆర్ లైఫ్ కేర్ ఆసుపత్రికి రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. సామాన్యుడి నుంచి మధ్య తరగతి వరకు అందరూ ఇక్కడికి వచ్చి పరీక్షలు చేయించుకుంటారు. కానీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి ఆదేశాలతో సోమవారం వెళ్లిన అధికారుల బృందానికి దయానియంగా కనిపించాయి. ఆసుపత్రి ప్రయోగశాలలో పరీక్షలకు వాడే పలు పరీక్షా సామాగ్రి కిట్ల గడువు చాలా రోజుల క్రితమే ముగిసిపోయాయి సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర 20 ఆసుపత్రుల్లో తనిఖీలు మంగళవారం మరోసారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టణంలోని 20 ప్రైవేటు ఆసుపత్రులపై ఏకకాలంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాలతో ఆసుపత్రులను ఒకేసారి తనిఖీ చేశారు. రికార్డులు, మందుల నిల్వ, సిబ్బంది వివరాలు, పరికరాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 3 ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. పోతిరెడ్డిపల్లిలోని మెహర్ ఫిజియో సెంటర్ ను సరైనా అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. ఈ తనిఖీల అనంతరం వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పని సరిగా నాణ్యతా ప్రమాణాలు, రోగుల భద్రతా నిబంధనలు మరియు చట్టపరమైన అనుమతులను పాటించాలి. గడువు ముగిసిన మందులు, ప్రయోగశాల పరీక్షా సామగ్రి లేదా ఇతర వైద్య సామగ్రిని ఉపయోగించడం, అలాగే చెల్లుబాటు అయ్యే అనుమతులు లేకుండా వైద్య సేవలు నిర్వహించడం సహించబడదు అని ఆమె స్పష్టం చేశారు. అన్ని ఆసుపత్రులు తమ అనుమతులు, పరీక్షా సామగ్రి గడువు తేదీలను ఎప్పటికప్పుడుపరిశీలించుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.ప్రజల్లో ఆందోళన...తాము కష్టపడి సంపాదించిన డబ్బులు ఆసుపత్రులకు ఇస్తున్నాం. కానీ వాళ్లు మా ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. ఇలాంటి తనిఖీలు ప్రతి నెలా జరగాలని కోరుతున్నారు. జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులపై ఇలాంటి ఫిర్యాదులు కొత్తేమీ కాదు. అధిక రుసుములు, నాణ్యత లేని సేవలపై ప్రజల నుంచి ఎప్పటి నుంచో విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య శాఖ చర్యలను ప్రజలు హర్షిస్తున్నారు.

# డిజిటలైజేషన్ లో ఉమ్మడి జిల్లాలో గద్వాలకు మొదటి స్థానం

**87.31 శాతం డిజిటలైజేషన్ పూర్తి**

**ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు కృషి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా మొదట నిర్వహించిన ఇంటింటి సర్వే అనంతరం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ లో జోగులాంబ గద్వాల జిల్లా ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్యుమరేషన్ పత్రాలను ఫిలప్ చేసి ఇచ్చిన వారి వివరాలను 87.31 శాతం డిజిటలైజేషన్ చేయడంతో ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 63,925 అన్ కలెక్టబుల్ ఫార్మ్స్ ఉన్నట్లు చెప్పారు. ఆగస్టు 17వ తేదీన ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 17 వ తేదీ నుంచి సెప్టెంబర్ 16 వరకు ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఓటర్ల పేర్లు, ఇంటి పేర్లు, తదితర తప్పిదాలు ఉన్న అనామిలెస్ ఓటర్లు నోటీసులు అందుకున్న తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 డాక్యుమెంట్స్ లో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు. సంబంధిత అధికారుల వెరిఫికేషన్ అనంతరం తప్పిదాలను సరిచేసి అక్టోబర్ 19న ఫైనల్ ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# హత్య కేసులో బెయిల్‌పై విడుదలై పరారైన ఓ నిందితుడు అరెస్ట్

మల్కాజిగిరి, ఆగస్ట్ 11,(విజన్ ఆంధ్ర): ఓ హత్య కేసులో శిక్ష అనుభవిస్తూ,బెయిల్‌పై విడుదలై బయటకు వచ్చి, పరారైన ఓ నిందితుడుని నేరేడ్ మెట్ పోలీసులు తిరిగి అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్ హెచ్ ఓ ఏ.వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి.నేరేడ్‌మెట్ కు చెందిన పెరికొల్ల శ్రీకాంత్ (40) డ్రైవర్. తనభార్యను హత్య చేసిన కేసులో న్యాయస్థానం 2017లో జీవిత ఖైదు విధించింది. హైకోర్టు నుంచి బెయిల్‌పై విడుదలై బయటకు వచ్చి పరారైనాడు. నేరేడ్‌మెట్ పోలీసులు ఎట్టకేలకునిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.నిందితుడిని పట్టుకుని కోర్టు ముందు హాజరుపరిచిన నేరేడ్‌మెట్ పోలీసుల కృషిని, ఉన్నతాధికారులు అభినందించారు

# ఆరోగ్యకరమైన ఆరోగ్యానికి దివ్య ఔషధం గానుగ

**–రిఫైన్డ్ ఆయిల్స్ కు స్వస్తి పలుకుదాం.. “గానుగ“ను కొని తెచ్చుకుందాం.**

**– ప్రజల ఆరోగ్య రహస్యం తీసుకునే ఆహారంలోనేనా,**

**– గానుగ నూనె వాడకం పెరగాలి.. ఆయుర్ధాన్ని పెంచాలి,**






మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 11( విజన్ ఆంధ్ర ప్రతినిధి): ప్రస్తుత సమాజంలో రిఫైన్డ్ ఆయిల్స్ మాయాజాలం తాండవిస్తోంది. ఆకర్షణీయమైన, అందమైన ప్యాకెట్లు రిఫైన్డ్ ఆయిల్స్ డిజైన్ చేసి అమాయకమైన ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. తమ వ్యాపార కార్యకలాపాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నాయి. వివిధ కంపెనీలు అందజేస్తున్న ప్రకటనలకు, ధరలకు బోల్తాపడి ప్రజలు రిఫైన్డ్ ఆయిల్స్ కొనుగోలుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి రిఫైండ్ ఆయిల్ వినియోగించడం ద్వారా అనేక రకాల వ్యాధుల బారిన పడడమే కాకుండా దీర్ఘకాలిక వ్యాధులతో పాటు క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన రోగాలను కొని తెచ్చుకున్నట్లు అవుతుందని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**రిఫైన్డ్ ఆయిల్స్ తో అనర్థాలు ఎన్నో..!?**

150 నుండి 200 కిలోల రేటున్న మూడు కిలోలకి పైగా పల్లీలు పట్టిస్తేనే కిలో పల్లి నూనె వస్తది... అలాంటిది 150 నుండి 200 రూపాయలకు కిలో రిఫైండ్ ఆయిల్ పల్లి నూనె ప్యాకెట్ ఎలా వస్తుందన్న విషయాన్ని కస్టమర్స్ ఎలా మర్చిపోతున్నారో అర్థం కావడం లేదు. జనాలను పిచ్చోళ్లను చేయడానికి రిఫైండ్ ఆయిల్స్ కంపెనీలు పడరాని పాట్లు పడుతూ ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

అంతేకాకుండా వివిధ రకాల రసాయనాలతో కృతిమంగా కల్తీ నూనెలను తయారుచేసి ప్రజలకు అంటగడుతున్నారు. వీటిని వినియోగించిన ప్రజలు పలు రకాల అనారోగ్యాల సమస్యల బారిన పడుతున్నారని, కానీ ఈ ఆయిల్స్ ఉపయోగించడం ద్వారానే జబ్బుల బారిన పడుతున్నామనే అసలు విషయాన్ని ప్రజల గ్రహించలేకపోతున్నారని పలువురు ఆయుర్వేద, హోమియోపతి, అల్లోపతి డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజల ఆలోచన మారాలి.. గానుగ నూనెనే కొనాలి..!**

ఆరోగ్యకరమైన సమాజం కోసం, ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రజలందరూ గానుగ నూనె బాట పటాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పర్యావరణవేత్తలు, ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మానవుడి జీవన మనుగడ ప్రకృతితో మమేకమై ఉందని, ప్రకృతి ప్రసాదించిన సహజ సిద్ధమైన పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు. గానుగ నూనె ప్రకృతితో అనుసంధానమై ఉందని, ఎలాంటి రసాయనాలు, కెమికల్స్ ఇతర పదార్థాలు కల్పకుండా తయారుచేసిన ఎద్దు గానుగ నూనెకు, కోల్డ్ ప్రెస్ గానుగ నూనెలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. గానుగ నూనెలకు ధర అధికమైనప్పటికీ, ఆరోగ్యం కన్నా అది అధికం కాదనే విషయాన్ని ప్రజలందరూ గుర్తించుకోవాలని సూచిస్తున్నారు.

**పాత పద్ధతులకు పునాదులు వేద్దాం..!**

సాంప్రదాయబద్ధంగా వస్తున్న కొన్ని మంచి పద్ధతులను అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన పెద్దలు, పూర్వీకులు గానుగ పట్టించిన నూనెలను వాడి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జీవించే వారని మన పెద్దలు గుర్తు చేస్తున్నారు. వ్యవసాయం చేయడానికి ఆవులను ఎద్దులను కూడా వినియోగించి వ్యవసాయం చేసేవారని, ఆవును పాలకు వినియోగించగా.. ఎద్దును గానుగ కోసం ఉపయోగించేవారని తెలియజేస్తున్నారు. ఎద్దు ద్వారా గానుగ పట్టించిన నూనెలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడి నాణ్యమైన, ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆయిల్స్ పట్టి ఉపయోగించేవారని, ఇవి ఎంతో శ్రేష్టమని గుర్తు చేస్తున్నారు. అందుకే నాటి ప్రజలు హార్ట్ ఎటాక్, బీపీలు, షుగర్లు లాంటి వ్యాధులే కాకుండా క్యాన్సర్ లాంటి వ్యాధుల పేర్లను కూడా కనీసం వినకపోయేవారని అంటున్నారు. ఏది ఏమైనాప్పటికీ మనం తీసుకునే ఆహార పదార్థాలే మన దేహాన్ని డిసైడ్ చేస్తాయని, ఆయుష్షు ప్రమాణాల రేటును కూడా నిర్ణయిస్తాయని పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.

# జర్నలిస్టుల సంక్షేమమే మా ప్రధాన ఎజెండా

**–జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**

**–70 సంవత్సరాల చరిత్ర కలిగిన యూనియన్**

**–రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్**

**– పటాన్‌చెరులో టీయూడబ్ల్యూజే ' ఐజేయూ సర్వసభ్య సమావేశం**

**– ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడిటేషన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**



సంగారెడ్డి బ్యూరో ఆగస్టు :11(విజన్ ఆంధ్ర)జర్నలిస్టుల సంక్షేమమే యూనియన్ ప్రధాన ఎజెండా అని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే ' ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు.పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం రామచంద్రాపూర్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, యూనియన్ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. సంక్షేమమే యూనియన్ ప్రధాన ఎజెండా అని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు భాగస్వామి కావాలని, జర్నలిస్టుల సమస్యలపై సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యల మధ్య విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఆరోగ్య కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.అర్హత ఉన్నప్పటికీ ఇంకా అక్రిడిటేషన్ కార్డులు అందని జర్నలిస్టులు ఉన్నారని, వారందరికీ నిబంధనల మేరకు కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు సహా అన్ని విభాగాల్లో పనిచేస్తున్న పాత్రికేయుల సమస్యలను సమానంగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు.జర్నలిస్టుల మధ్య ఐక్యత ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యూనియన్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం విషయంలో సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఆరోగ్య కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు ప్రతి ఒక్కరు సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో , జిల్లా కమిటీ నాయకులు, కార్యవర్గ సభ్యులు మాట్లాడి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లూరి విలాస్ (విల్సన్ )జిల్లా ఉపాధ్యక్షుడు పెరమాన్ల కిషోర్,చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరిఫ్, ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్షులు హాజీ, మినాజ్ కార్యదర్శులు, సభ్యులు పాల్గొని జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమంపై తమ సూచనలు చేశారు.

# గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని నియమించిన మండల అధ్యక్షురాలు

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 11(విజన్ ఆంధ్ర);–సంఘటన్ సృజన్ అబియాన్లో భగంగాలితెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ వర్ధన్నపేట్ ఎమ్మెల్యే కే. ఆర్. నాగరాజు అధేశాల మేరకు వర్ధన్నపేట నియోజకవర్గంంగంలో ని పర్వతగిరి మండలంలోని అనంతారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు శ్రీమతి ఇస్లావత్ సావిత్రి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మండల ముఖ్య నాయకుల సమక్షంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఉప అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి మరియు కార్యవర్గ సభ్యులను నియమచడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ

అధ్యక్షుడు : అబ్బరబోయిన రాజు

ఉపాధ్యక్షుడు : కౌడగాని జితేందర్

ప్రధాన కార్యదర్శి : చెవ్వల రాజు

కోశాధికారి : అబ్బరబోయిన కుమారస్వామి

కార్యదర్శి : మేకిరి మధుకర్కార్యవర్గ సభ్యులు ...పంతంగి యాకన్న, గొల్లపల్లి రమనయ్య, అబ్బరబోయిన వీరాస్వామి, పంతంగి వెంకన్న.

ఈ కార్యక్రమంలో చౌటపల్లి ప్యాక్స్ చైర్మన్ గొర్రె దేవేందర్,మాజీ సర్పంచ్ పల్లకొండ యాకయ్య, మాజీ అధ్యక్షులు పెర్వారం దేవేందర్, మాజీ డైరెక్టర్ కొత్తపెల్లి సదానందం, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జేరిపోతుల నరేందర్, ముఖ్య కార్యకర్తలు గుంటి అనిల్, అబ్బరబోయిన వీరాస్వామి, గొల్లపెల్లి రమునయ్య, మెకిరి ఉపేందర్, పంతంగి రాజు, బేతి సతీష్, అబ్బరబోయిన ధర్మతేజ తధితరులు పాల్గొన్నారు

# వసతి గృహాల పరిసరాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్





మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ,ఆగస్ట్ 11 (విజన్ ఆంధ్ర) మహబూబ్‌నగర్ జిల్లాలోని వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా, పాములు, విషపురుగులకు ఆవాసంగా మారకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం వసతి గృహాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై అన్ని సంక్షేమ శాఖల అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలు, గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, ఇతర ప్రదేశాల్లో పారిశుధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.వసతి గృహాల పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పొదలు, నిల్వ నీరు లేకుండా చూడాలని తెలిపారు. పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎప్పటికప్పుడు తొలగించి, వ్యర్థాలను సక్రమంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పాములు, ఇతర విషపురుగులు దాగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు.విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాముకాట్ల నివారణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వసతి గృహాల భవనాల చుట్టూ పరిశుభ్రతను పాటించడంతో పాటు రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి, తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు

# చేయూత పింఛన్లకు ‘సువర్ణ అవకాశం

**ఒక్క అర్హుడూ మిస్ కావొద్దు – కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్, ఆగస్టు 11 విజన్ ఆంధ్ర అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో డి.ఆర్.డి.ఓ, సంక్షేమ శాఖ, మెప్మా, జిల్లా పంచాయతీ, జిల్లా పరిషత్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని సంతృప్త స్థాయిలో గుర్తించి వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు వారీగా ఈ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోందని, ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నందున ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు.గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించి ఒక్క అర్హుడి కేసు కూడా మిస్ కాకుండా చూడాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఒంటరి మహిళలు జన ధ్రువపత్రం, ఎస్సెస్సీ మెమో, ఓటరు గుర్తింపు కార్డు, వితంతువులు భర్త మరణ ధ్రువపత్రం, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అర్హుల గుర్తింపు నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన, తుది జాబితా తయారీ వరకు ఎక్కడా తప్పిదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డి.ఆర్.డి.ఓ గీత, మెప్మా పి.డి స్వరూపారాణి, డి.పి.ఓ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు



# సార్వత్రిక విద్యతో ఉన్నత చదువులకు అవకాశం

- ఎస్ఎస్ సి, ఇంటర్ లో ప్రవేశాల గోడపత్రికలను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ఆగస్టు 11( విజన్ ఆంధ్ర బ్యూరో) : చదువును మధ్యలో ఆపేసిన వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విధానం ద్వారా తిరిగి చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్ సి, ఇంటర్ లో ప్రవేశాల గోడపత్రికలను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఎస్ఎస్ సి లో చేరేందుకు ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు అర్హులని, ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదన్నారు. ఇంటర్ కు సంబంధించి ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల వయస్సు నుండి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన బోర్డు నుండి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని లేదా ఇతర బోర్డులలో ఇంటర్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులని తెలిపారు. రెండింటికి గరిష్ట వయో పరిమితి లేదన్నారు. టాస్ ద్వారా ఉత్తీర్ణులైన విద్యార్థులు వివిధ విశ్వవిద్యాలయాల ద్వారా ఉన్నత చదువులకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి గల వారందరూ మరిన్ని వివరాలకు తమ సమీపంలోని దూర విద్య కేంద్రం సమన్వయకర్తను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సంబంధిత వెబ్సైట్ ద్వారా ఈనెల 17వ తేదీలోగా, జరిమానాతో ఈనెల 29వ తేదీ వరకు ఆన్లైన్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, టాస్ జిల్లా కోఆర్డినేటర్ సునీతమ్మ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిసీఎంపీఎఫ్ సంయుక్త 'ప్రయాస్‌సమాధాన్' సమావేశం

- పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్‌ల పరిష్కారానికి సీ-కేర్స్ ద్వారా వేగవంతమైన చర్యలు
- ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చూడాలి




కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ రీఫండ్, పెన్షన్ క్లెయిమ్‌లను వేగవంతంగా పరిష్కరించేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, సీఎంపీఎఫ్ సంస్థలు సంయుక్తంగా 'ప్రయాస్‌సమాధాన్' సమావేశాన్ని నిర్వహించాయి.

సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్ఆర్డీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు జరిగిన ఈ సమావేశానికి కొత్తగూడెం ప్రాంతంలోని కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ఏరియాల వ్యక్తిగత విభాగం, ఆర్థిక విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. సీఎంపీఎఫ్ రీఫండ్, పెన్షన్ క్లెయిమ్‌లను సీ-కేర్స్ దరఖాస్తులో నమోదు చేసి, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధానంపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జీఎం (పర్సనల్, వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ) కే. అజయ్ కుమార్, సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్లు వంశీధర్ కుసుంభ, ఎం. కనకమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం వద్దు**

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. బొగ్గు గని ఉద్యోగులకు సంబంధించిన పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్‌లను సీ-కేర్స్ దరఖాస్తు ద్వారా వేగవంతంగా పరిష్కరించడమే 'ప్రయాస్‌సమాధాన్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సీ-కేర్స్ దరఖాస్తుపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన వివరాలను కూడా సీ-కేర్స్‌లో నమోదు చేయాలని తెలిపారు. పెన్షన్, పీఎఫ్ క్లెయిమ్‌ల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉద్యోగులు, కార్మికులకు వారి హక్కుగా లభించాల్సిన పీఎఫ్, పెన్షన్ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**సీ-కేర్స్ వినియోగంపై సమగ్ర అవగాహన**

సమావేశంలో సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ వంశీధర్ కుసుంభ మాట్లాడుతూ సీ-కేర్స్ ద్వారా రీఫండ్, పెన్షన్ క్లెయిమ్‌లను ఎలాంటి తప్పులు లేకుండా సకాలంలో సమర్పించాలని సూచించారు. ఏవైనా కారణాలతో తిరిగి పంపిన క్లెయిమ్‌లను నిర్ణీత గడువులోపు సరిచేసి మళ్లీ సమర్పించాలని తెలిపారు. డిసెంబర్‌లో పదవీ విరమణ చేయనున్న సభ్యులకు సంబంధించి అనుబంధం-III సమర్పించడం, సీ-కేర్స్‌లో వీవీ స్టేట్‌మెంట్లు, పీఎస్-5 అప్‌లోడ్ చేయడం, కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమాచారాన్ని సీ-కేర్స్‌లో నమోదు చేయడం వంటి అంశాలపై వివరించారు. అదేవిధంగా సీ-కేర్స్ సభ్యుల లాగిన్‌ను ఉద్యోగులు ఎలా వినియోగించుకోవాలనే అంశంపై కూడా అవగాహన కల్పించారు. క్లెయిమ్‌లను సీ-కేర్స్‌లో నమోదు చేసే సమయంలో అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సందేహాలను ఏరియాల వారీగా తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలను సూచించారు.

**కార్మికులకు ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు**

సీఎంపీఎఫ్ రీఫండ్, పెన్షన్ క్లెయిమ్‌ల ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. క్లెయిమ్‌ల సమర్పణ సమయంలో తప్పులు, అసంపూర్ణ సమాచారం కారణంగా క్లెయిమ్‌లు తిరిగి రావడం లేదా పరిష్కారంలో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన పీఎఫ్, పెన్షన్ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించేలా అధికారులు వారికి సహకరించాలని సూచించారు.

**పలువురు అధికారులు హాజరు**

ఈ సమావేశంలో జీఎం (పర్సనల్, వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ) కే. అజయ్ కుమార్, సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్లు వంశీధర్ కుసుంభ, ఎం. కనకమ్మ, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, డీజీఎం (పర్సనల్) బి. శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, డీజీఎం (ఎఫ్ అండ్ ఏ) సీహెచ్. రమేష్, సీనియర్ పీఓలు ఎం. మురళి, జి. సుధాకర్, కే. శ్రీనివాస్, సీఎంపీఎఫ్ సహాయ కమిషనర్ పి. చిరంజీవితో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సింగరేణిసీఎంపీఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ 'ప్రయాస్‌సమాధాన్' సమావేశం ద్వారా పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్‌లను సీ-కేర్స్ ద్వారా సమర్పించడం, పరిష్కరించడం వంటి అంశాలపై అధికారులు, సిబ్బందికి స్పష్టత లభించింది. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# పీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంపై ఆశా నోడల్స్, ఫెసిలిటేటర్లకు శిక్షణ

- డీఎంహెచ్ఓ. డాక్టర్ జె.సంధ్య కిరణ్మయి



గద్వాల ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. జె. సంధ్య కిరణ్మయి అధ్యక్షతన జిల్లాలోని ఆశా నోడల్స్, ఆశా ఫెసిలిటేటర్లకు రాష్ట్రీయ కిషోర్ స్వస్థ్య కార్యక్రమంలో (ఆర్ కే ఎస్ కే) భాగంగ పీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ప్రతి ఆశా కార్యకర్త తన పరిధిలో 1019 సంవత్సరాల వయస్సు గల నలుగురు యుక్తవయస్సు వారిని (ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు) ఎంపిక చేయాలని తెలిపారు. వీరిలో పాఠశాలకు వెళ్లే వారు, పాఠశాలకు వెళ్లని వారు ఇద్దరూ ఉండేలా ఎంపిక చేయాలని సూచించారు. ఎంపిక చేసిన పీర్ ఎడ్యుకేటర్లు తమ ప్రాంతంలో 15 నుంచి 20 మంది సహచరులతో చిన్న గ్రూపులను ఏర్పాటు చేసి, నెలకు నాలుగు సమావేశాలు నిర్వహిస్తూ ఆరోగ్యం, సంబంధిత అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో పోషకాహారం, రక్తహీనత నివారణ, యుక్తవయస్సులో శారీరకమానసిక మార్పులు, పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, మాదక పదార్థాల వినియోగం నివారణ, అసంక్రమణ వ్యాధుల నివారణ, నెలసరి రుతు స్రావ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత లైంగిక ప్రవర్తన వంటి అంశాలపై పీర్ ఎడ్యుకేటర్ల ద్వారా సమాచారం, అవగాహన,విద్య అందించనున్నట్లు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్. అస్గర్ అలీ,డిపిఎచ్ఎన్ఓ.వరలక్ష్మి, ఇన్‌చార్జి మీడియా ఆఫీసర్ హీర్య నాయక్,పిఎచ్ఎన్. తీర్మాలరాణి,ఎస్ఓ. తిరుమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించాలి.
- నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట ,ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర)

దామరగిద్ద మండల కేంద్రం లోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించా రు.మండల మహిళా సమా ఖ్య కార్యాలయం పక్కన ఉన్న భవనంలో 2019 సంవత్సరం నుంచి సీజన్ వారీగా మహిళా సమాఖ్య సభ్యులు సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్లు డీపీఎం జయన్న కలెక్టర్‌కు వివరిం చారు. యూనిట్ ద్వారా వచ్చిన లాభాలు, మహిళ లకు కల్పించిన ఉపాధి అవకాశాలతో పాటు యూనిట్‌లో తయారు చేసిన సీతాఫలం గుజ్జును విదేశాలకు సైతం ఎగుమతి చేసినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ప్రస్తుత సీజన్‌లో కూడా సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగిం చాలని కలెక్టర్ సూచించా రు. ప్రస్తుతం ఉన్న భవనం లో సీతాఫలాలను నిల్వ చేసేందుకు, అవసరమైన ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసేందు కు స్థలం సరిపోవడం లేదని మహిళా సమాఖ్య సభ్యు లు కలెక్టర్ దృష్టికి తీసుకువ చ్చారు. యూనిట్ నిర్వహ ణకు అనువుగా పెద్ద గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.దీనిపై తహసీ ల్దార్ తిరుపతయ్య మాట్లాడుతూ మండలంలో ని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించి నట్లు కలెక్టర్‌కు తెలిపారు. వీలైనంత త్వరగా ఆ స్థలా న్ని సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించా లని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అదేవిధంగా వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా అనువైన స్థలాన్ని కేటాయించాలని సూచిం చారు.స్థలం కేటాయించే వరకు ప్రస్తుత సీజన్‌లో ఉన్న భవనంలోనే సీతా ఫలం ప్రాసెసింగ్ యూని ట్‌ను కొనసాగించాలని మహిళా సమాఖ్య సభ్యు లకు కలెక్టర్ సూచించారు.

**మహిళా సంఘాల కార్యకలాపాలపై ఆరా**

మండలంలోని స్వయం సహాయక సంఘా ల నిర్వహణ, బ్యాంకు రుణాలు, ఎన్‌పీఏ, కిశోర బాలికల సంఘాల ఏర్పా టు, వీఓ భవనాల నిర్మా ణాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసు కున్నారు.మండలంలో నిర్మాణంలో ఉన్న వీఓ భవనాలను మరో 20 రోజుల్లోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయా లని అధికారులను ఆదేశిం చారు. అవసరమైతే 'మై వన్' సాంకేతికతను విని యోగించి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచిం చారు.

**వీఓ భవన నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్**

చివరగా మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న వీఓ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలిం చారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనుల ను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారు లకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వెంకట్ రాములు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, ఎంపీడీవో సాయి లక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై కృషి..

- సూర్యాపేట డివిజన్ స్థాయి అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం.
- ప్రజలకు అందుబాటులో ఉండాలి.. ఫిర్యాదులు, కేసులు పెండింగ్ ఉండొద్దు.
- సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని డీఎస్పీ, సీఐలకు ఆదేశం.
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె నరసింహ





సూర్యాపేట ఆగస్టు 11:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం సూర్యాపేట డివిజన్ స్థాయి పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో నమోదైన కేసుల తీరుతెన్నులు, పోలీసు దర్యాప్తు మరియు కేసుల పురోగతి స్థితిగతులను సమీక్షించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని స్పష్టం చేశారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రణాళికతో పని చేస్తూ కృషి చేయాలని అన్నారు. మహిళల భద్రతలో ప్రాధాన్యం తో పని చేసి బాధితులకు త్వరగా సేవలు అందించాలని కోరారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, కేసులు ఏమాత్రం పెండింగ్‌లో ఉండొద్దు అని అధికారులను ఆదేశించారు. నేరాల అదుపునకు సాంకేతిక పద్ధతులను ఉపయోగించాలని, క్షేత్రస్థాయిలో సమాచారం ఇచ్చే వనరులను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమాజంలో నేరాల నియంత్రణకు ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై, సిబ్బంది విధి నిర్వహణపై నిరంతర క్షేత్ర స్థాయి పర్యవేక్షణ ఉంచాలని, సిబ్బందిని ఎప్పటికప్పుడు మోటివేషన్ చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డీఎస్పీ రవి, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ లు వెంకటయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్ రావు, రాజశేఖర్, డివిజన్ ఎస్సైలు, టెక్నికల్ టీం ఎస్ఐ రాజశేఖర్ డిసిఆర్బీ ఎస్ఐ ఝాన్సి రాణీ,గోపి కృష్ణ, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారుల నిర్వాకం

- వ్యక్తి ఒకరే.. మూడుసార్లు చనిపోయినట్లు నమోదు!
- బొమ్మన్‌పల్లి గ్రామ పంచాయతీలో డెత్, బర్త్ సర్టిఫికెట్ల జారీలో అక్రమాల ఆరోపణలు
- విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయంటున్న గ్రామస్థులు





అచ్చంపేట, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర): ఒక వ్యక్తి జీవితంలో ఒక్కసారే మరణిస్తాడు. మరణించిన వ్యక్తికి అధికారికంగా ఒక మరణ ధ్రువీకరణ పత్రం జారీ కావాలి. కానీ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి గ్రామ పంచాయతీలో ఇందుకు భిన్నంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే వ్యక్తి వేర్వేరు తేదీల్లో మరణించినట్లు రికార్డుల్లో నమోదు చేసి, వేర్వేరు డెత్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు పత్రాల ఆధారంగా బయటపడింది ఈ విషయంలో ఆరోపణలు అధికంగా వెల్లువెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఒకే వ్యక్తికి భిన్నమైన మరణ తేదీలతో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలు గ్రామంలో మరికొంతమందికి కూడా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ధ్రువీకరణ పత్రం జారీకి పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు కూడా స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

**ఒకే వ్యక్తికి రెండు డెత్ సర్టిఫికెట్లు జారీ**

**జల్లెల గోపయ్య:**

2023 డిసెంబర్ 10న మరణించినట్లు, అదే నెల 15న రిజిస్ట్రేషన్ నంబర్ 90తో నమోదు చేసి డెత్ సర్టిఫికెట్ జణహీూ022615403517 జారీ చేసినట్లు వివరాలు ఉన్నాయి. ఇదే వ్యక్తి 2023 నవంబర్ 15న మరణించినట్లు 2025 మార్చి 3న రిజిస్ట్రేషన్ నంబర్ 07తో మరోసారి నమోదు చేసి డెత్ సర్టిఫికెట్ జణహీూ022615403488 జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా

**రాగుల బక్కమ్మ:**

2021 జనవరి 16న మరణించినట్లు 2021 జనవరి 17న రిజిస్ట్రేషన్ నంబర్ 2తో నమోదు చేసి డెత్ సర్టిఫికెట్ జణహీూ022615413627 ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. అదే వ్యక్తి 2024 అక్టోబర్ 27న మరణించినట్లు 2024 డిసెంబర్ 24న రిజిస్ట్రేషన్ నమోదు చేసినట్లు వెల్లడయింది

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 11,(విజన్ ఆంధ్ర); నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నందున జిల్లాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోఫీనగర్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్ లో 15వ తేదీన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులను కార్యక్రమానికి ఆహ్వానించాలని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, సరైన లైటింగ్, సౌండ్ సిస్టం ఉండేలా చూడాలన్నారు. ఎల్ఈడి తెరను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు త్రాగునీరు అందిస్తూ ఉండాలన్నారు. సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, ఆర్డిఓ దేవిదాస్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర వేళ ఆపద్బాంధవుడు.. డయల్112

- ఆపదలో ఉంటే భయపడొద్దు.. ఒక్క కాల్‌తో పోలీసుల సాయం
- విద్యార్థులు, బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలి: షీ టీమ్, ఏహెచ్‌టీయూ ఎస్ఐ లక్ష్మణ్
- ఆనందకని జెడ్పీహెచ్ఎస్‌లో డయల్112, షీ టీమ్‌పై అవగాహన కార్యక్రమం

కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు, భద్రతను కాపాడేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న డయల్112 అత్యవసర సేవలు ప్రజలకు ఆపద్బాంధవంగా నిలుస్తున్నాయని షీ టీమ్, ఏహెచ్‌టీయూ ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. ఆపద సమయంలో భయపడకుండా, ఆలస్యం చేయకుండా వెంటనే 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, బాలికలు, మహిళలు తమ భద్రత పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ఆనందఖని గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో షీ టీమ్, ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో డయల్112, మహిళలుబాలికల భద్రత, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ లక్ష్మణ్ హాజరై విద్యార్థులతో మాట్లాడారు. అత్యవసర సమయంలో డయల్112ను ఎలా వినియోగించాలి, ఎలాంటి పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలి, ప్రమాదం లేదా ఆపద సమయంలో సకాలంలో సమాచారం అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

**ఆపదలో ఉంటే భయపడొద్దు.. 112కు కాల్ చేయండి**

రోడ్డు ప్రమాదాలు, మహిళలు, బాలికలపై వేధింపులు, గొడవలు, బెదిరింపులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆపద సమయంలో సమాచారం అందించడంలో ఆలస్యం చేయకుండా పోలీసులకు తెలియజేస్తే సత్వర సహాయం అందే అవకాశం ఉంటుందని చెప్పారు.

విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా బాలికలను ఎవరైనా వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, వెంటపడినా లేదా బెదిరింపులకు పాల్పడినా మౌనంగా ఉండకుండా వెంటనే విశ్వసనీయ వ్యక్తులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్ అండ**



మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న షీ టీమ్ సేవలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు, వెంటపడటం, అసభ్యకర ప్రవర్తన వంటి ఘటనలు ఎదురైతే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు వంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా ఎవరైనా వేధింపులకు పాల్పడినా, బెదిరించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే చట్టాలు, మహిళల భద్రత, అత్యవసర సేవలు, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పేర్కొన్నారు. తమ చుట్టూ జరిగే ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు, ఇతరులు ఆపదలో ఉన్నప్పుడు బాధ్యతగా స్పందించాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లక్ష్మి, ఏఎస్ఐ నాగయ్య, పీసీ రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల భద్రత, మహిళలుబాలికల రక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**




మల్కాజిగిరి, ఆగస్ట్ 11,(విజన్ ఆంధ్ర): అమ్మవారి ఆశీస్సులు ప్రజల అందరిపై ఉండాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బోనాల ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి మల్కాజిగిరి చౌరస్తాలో భాస్కర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావులు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనాల పండుగను శాంతియుతంగా అందరూ కలిసి మెలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు వారు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, నక్క ప్రభాకర్ గౌడ్, బి బ్లాక్ అద్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్,సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, రాందాస్ సంతోష్ ముదిరాజ్, బ్రహ్మయ్య, రామక్రిష్ణ, రాము,లఖన్,శంకర్ రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ నూతన వైస్ చైర్మన్ మాల శ్రీనివాస్ ని సన్మానించిన దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్



గద్వాల ఆగస్టు 11( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని దళిత కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన మాల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్, జిల్లాదళిత జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు దాగే పోగు వెంకటన్న, టిడబ్ల్యూజెఎఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ మన్నపురం రాముడు, వేణుగోపాల్ తదితర మిత్రబృందం పాల్గొని మాల శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో మాల శ్రీనివాస్ మరింత సమర్థవంతంగా పనిచేసి దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు లభించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# మృతికి కారణమైన జస్వంత్, అండ్రు జోసఫ్ ఎడ్వర్డ్ నీ కఠిన శిక్షించాలి

**- డాక్టర్ కనిక ప్రియాంక చిత్రపటానికి నివాళులర్పించిన పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు మెడికో విద్యార్థులు**



గద్వాల ఆగస్టు 11(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో మెడికో విద్యార్థిని డాక్టర్ కనికే ప్రియాంకకు మెడికల్ విద్యార్థులు,శంకర ప్రభాకర్ (టీ పి ఫ్), (పి వై ఎల్)బీరెల్లి దానయ్య ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శంకర ప్రభాకర్ (టీ పి ఫ్), (పి వై ఎల్)బీరెల్లిదానయ్య మాట్లాడుతూ, డాక్టర్ కనికే ప్రియాంక మృతి తీవ్ర విషాదాన్ని కలిగించిందని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక మెడికల్ విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఆమె మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మెడికో విద్యార్థులు మాట్లాడుతూ డాక్టర్ ప్రియాంక మృతికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారణమైన వారిని గుర్తించి, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నేరం రుజువైన వారికి చట్టపరమైన అత్యంత కఠిన శిక్షలు విధించాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భద్రత, ముఖ్యంగా మెడికల్ కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థినుల రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టళ్లలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని కోరారు. డాక్టర్ కనికే ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకు విద్యార్థులు ఐక్యంగా పోరాడుతారని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు కూడా మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్, నాగన్న, మెడికో విద్యార్థులు, మణికంఠ రాజశేఖర్ గుజ్జురాల్, విజయ్, భరత్, సాయికుమార్, తదితరుల మెడుకో విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసింది..!

**- హంతకులను కఠినంగా శిక్షించాలి. ఎంపీ డీకే అరుణ**



గద్వాల ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు కారుతో నిర్లక్ష్యంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై, వారం రోజుల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూసిన పీజీ మెడికో విద్యార్థిని డాక్టర్ కనికె ప్రియాంక మరణం నన్ను తీవ్రంగా కలచివేసిందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ తెలిపారు. జోగుళాంబ గద్వాల్ జిల్లా అయిజ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ఒక పేద కుటుంబం నుండి ఎంతో కష్టపడి పైకొచ్చిన వైద్య విద్యార్థి ఇలా అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆశలతో ఉన్నత చదువులకు పంపిన తల్లిదండ్రులకు ఈ రోజు తీరని అన్యాయం జరిగిందని,మద్యం మత్తులో విచ్చలవిడిగా వాహనాలు నడుపుతూ అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్న ఇలాంటి మృగాళ్లను సమాజం క్షమించదని అన్నారు. సమాజానికి ఎంతో సేవ చేయాల్సిన ఒక యువ వైద్యురాలి భవిష్యత్తును చిదిమేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కూతురిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ప్రియాంక తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులకు ఎంపీ డీకే అరుణ తన సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని, ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఆగస్టు 15 వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న ఈ వేడుకకు సంబంధించి వేదిక, పారిశుధ్యం, త్రాగు నీరు, సీటింగ్, తదితర ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రశంసాపత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగుల పేర్లతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువు లోపు పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఈనెల 15 నుంచి అర్హులైన వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేసేందుకు నిర్ణయించినందున సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కొత్తగా చేయూత పెన్షన్లను కూడా అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పెన్షన్ల కోసం ఇదివరకు దరఖాస్తు చేసుకున్న వాళ్లు ప్రస్తుతం కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 31వ తేదీలోగా అర్హులైన వారందరూ పెన్షన్ల కోసం సంబంధిత వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేయడంలో అలసత్వం చూపకుండా నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్న ఏజెన్సీలు...

**- AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**

**- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా..**





ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు11: (విజన్ ఆంధ్ర) : మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులను ఏజెన్సీలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మంగళవారం రోజున మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(AITUC) ఆధ్వర్యంలో ఆసిఫాబాద్లోని వీదీ (గ్రిడ్)కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశబ్ద కాలం నుంచి మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఏజెన్సీలు శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని అన్నారు. పెరుగుతున్న ధరలకు సమానంగా వేతనాలు పెంచవలసిన ఏజెన్సీలు కార్మికులను చాలీచాలని వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీ గురి చేస్తున్నాయి అన్నారు. గత ఐదు నెలల నుండి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక అనేక ఆర్థికమైన ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనం 26,000 చెల్లించాలని సీనియార్టీ ప్రకారం కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని అన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని,బోనస్,ఈఎస్ఐ పిఎఫ్,గ్రాటివిటీ,బోనస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పెట్రోల్ అలవెన్స్ తో పాటు ఇతర అలవెన్స్ ఇవ్వాలని ఇటీవల తీసుకొచ్చిన లొకేషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు, ఒక నెల జీతం బోనస్ గా ఇవ్వాలని. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు, కార్మికులపై ఏజెన్సీలు కక్ష సాధింపు చర్యలు వెంటనే ఉపసర్హించుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. EE రాకేష్ గారి ఆధ్వర్యంలో ఏజెన్సీలు యూనియన్లకు చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా పెండింగులో ఉన్న వేతనాలు ఈనెల చివరి వరకు చెల్లించి మిగత సమస్యలను పరిష్కారం చేస్తామని సానుకూలంగా స్పందించడంలో ధర్నా విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి,జిల్లా ఉపాధ్యక్షుడు రాజా గౌడ్,మహేష్, జిల్లా కార్యదర్శి షకీర్, మిషన్ భగీరత కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(AITUC)జిల్లా అధ్యక్షుడు బాలేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషడ్, శివమ్ దూబే, మహేష్, వెంకటెస్,రవీందర్, కుమార్, జంగు, గౌతమ్, అశోక్,ప్రకాష్,దుర్గాజి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలను వేయాలి - జిల్లా కలెక్టర్ సూచన



సిద్దిపేట జిల్లా ప్రతినిధి11 ఆగస్టు : సిద్దిపేట జిల్లాలో ఎల్ నినో వర్షాభావ పరిస్థితులలో జిల్లా రైతులు ఆరుతడి పంటలను పండించాలని జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్టిక్ ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ,ఉద్యానవనం శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ జిల్లాలో గల అన్నపూర్ణ సాగర్ 3.50 టీఎంసీలకు గాను 1.51 టీఎంసీల నీరు ఉండదని వాటిలో 0.32 డెత్ స్టోరేజ్ ఫోన్ 1.19 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, రంగనాయక సాగర్ 3.00 టీఎంసీలకు గాను 0.99 టీఎంసీ నీరు ఉందని వాటిలో డెత్ స్టోరేజ్ 0.17 టీఎంసీలు పోను. 0.82 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, మల్లన్న సాగర్ 50 టీఎంసీలకు గాను 13.86 టీఎంసీల నీరు ఉందని దానిలో 9.37 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.12 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, కొండపోచమ్మ సాగర్ టీఎంసీలకు గాను 15.00 టీఎంసీలకు గాను 6.31 టీఎంసీల నీరు ఉందని దానిలో 2.20 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.11 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, శనిగరం ప్రాజెక్టు 1.09 టీఎంసీలకు గాను 0.46 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటిని కేవలం త్రాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్రప్రభుత్వం సూచించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితిలో ఏర్పడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులలో కొత్తగా నీరు చేరలేదని అన్నారు. మళ్లీ వర్షాకాలం వరకు వర్షాలు పడే సూచనలు లేదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆదేశాల మేరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు అట్టి పెట్టడం జరిగిందని అన్నారు. కావున జిల్లాలో సాగునీరు లేదు కాబట్టి రైతులు వరి పంట పండించరాదని అన్నారు. గత సంవత్సరం 4.82 లక్షల ఎకరాలలో పంట వేయగా వాటిలో 3.68 లక్షల ఎకరాలలో కేవలం వరి పంట పండించడం జరిగిందని అన్నారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యానికి ప్రభుత్వం 1200 కోట్లు పైన చెల్లించడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వివిధ రకాలుగా అవగాహన కలిగించడం మూలంగా ఈ సంవత్సరం ఇప్పటికీ 70,000 ఎకరాల్లో పంట మార్పిడి జరిగి కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను వేశారని తెలిపారు. ఆగస్టు 15 తర్వాత ఆముదము, పత్తి , నూనె గింజల పంటలను పండించవచ్చని ఆరుతడి పంటలను పండించాలని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షాలు కురిస్తే సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయడానికి నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంఎల్సి యాదవరెడ్డమాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రాజెక్టుల ద్వారా నీటిని వదిలితే గూడవల్లి, హల్దివాగులో చెక్ డ్యామ్ లను నింపితే రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితిలో ఉన్నాయని ఆమేరకు ఆలోచించాలని సూచించారు. ఈ సందర్భంగా సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పంపించిన లేఖను జిల్లా కలెక్టర్ చదివి వినిపించారు. ఈ లేఖలో గోదావరి నది నుండి నీరు వృధా పోకుండా లిఫ్ట్ చేసి ప్రాజెక్టులను నింపి రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అదే విధంగా భూగర్భ జలాలను పెంచేలా ప్రభుత్వానికితెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కరీంనగర్సర్కిల్సీఈసత్యనారాయణ రెడ్డి, సిద్దిపేట్, గజ్వేల్, కరీంనగర్ సర్కిల్ ల ఎస్ఇలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు,డిస్టిక్ ఇరిగేషన్ ఆఫీసర్ నాగరాజు, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి.. కలలను నిజం చేసుకోండి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట ఆగస్టు 11:(విజన్ ఆంధ్ర) : విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరు(ఎస్) కేజీబీవీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, వసతి గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించి, వారి విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ గురించి ఆరా తీశారు. భోజనం నాణ్యతగా ఉందని, ఇదే నాణ్యతను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్.. విద్యార్థులతో సరదాగా మాట్లాడారు. “పెద్దయ్యాక మీరు ఏమవుతారు?“ అని ప్రశ్నించగా.. పలువురు విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ అవుతామని ఉత్సాహంగా సమాధానమిచ్చారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని చూసి ఆయన అభినందించారు. సొంత కాళ్లపై నిలబడాలంటే చదువే ఏకైక మార్గం. కష్టపడి చదివి మీ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని హితబోధ చేశారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**అధికారులకు ఆదేశాలు..**

పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్.. పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. తాగునీటి వసతి, టాయిలెట్ల నిర్వహణ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే కాకుండా, వారి ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విశాల్, తహసిల్దార్ అమిన్ సింగ్ ప్రిన్సిపాల్ వై సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐ.టి.ఐ & అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- ఐటీఐ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఖలీం**

గద్వాల ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలోని పదవ తరగతి పాసైన విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం ఏమనగా ప్రభుత్వ ఐ.టి.ఐ, ఏటిసి (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ) నందు 2026-2027, 2026-2028 విద్యా సంవత్సరానికి ఎన్సివిటి.పాట్రన్ క్రింద ఇంజనీరింగ్ కోర్సులలో రెండవ విడత అడ్మిషన్ కొరకు క్రింద తెలిపిన ట్రేడ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల కొరకు ఈనెల 06వ తేదీ నుండి 15 వరకు అవకాశం కలదని ఐటీఐ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఖలీం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈనెల 15 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఐ.టి.ఐ గద్వాల లో అందుబాటులో ఉన్న ట్రేడ్స్ వివరాలు ఎలక్ట్రీషియన్ - 02, సంవత్సరాలు. ఫిట్టర్ - 02, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ - 02,మెకానిక్ డీజిల్ - 01 సంవత్సరం కోర్సులు ఉన్నాయని అలాగే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఎ. టి. సి .) గద్వాల లో అందుబాటులో ఉన్న సి ఎన్ సీ మెషిన్ టెక్నీషియన్-02 సంవత్సరాల కోర్స్,మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ -02, వేర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ (ఫీనిట్ హెల్మెంట్ మెథడ్) - 02, ఇంజనీర్ డిజైన్ టెక్నీషియన్-01, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ - 01, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ -01 సంవత్సరం కోర్సులు గెలవని ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు ముందుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి15వ తేదీ వరకు https://iti.telangana.gov.in వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని అయన ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ 01.05.2026 నాటికీ 14-సంవత్సరాలు నిండిన 10వ తరగతి/8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు ఈ అవకాశం కలదని, అయితే 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కొన్ని కోర్సులకు మాత్రమే అర్హులని వాటి వివరాలను వెబ్ సైట్ లో పొందపరచినట్లు తెలియజేశారు. గమనిక : - అడ్మిషన్ ప్రయోజనాల కోసం విద్యార్థిని విద్యార్థులు తప్పనిసరిగా ప్రత్యేకమైన మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడి, ఆధార్ కార్డు కలిగి ఉండాలి. నమోదిత మొబైల్ నెంబర్, ఈమెయిల్ చిరునామా కోర్సు వ్యవధిలో ఏవిధంగాను సవరణలకు అనుమతించబడవు. ట్రైనీ వెరిఫికేషన్ కొరకు ట్రైనీలు రిజిస్టర్ మొబైల్ నెంబర్ను మాత్రమే ఉపయోగించాలి, వేరొక మొబైల్ నెంబర్ ని ఉపయోగించడం వల్ల ఐటిఐ విద్యార్థి అడ్మిషన్ తిరస్కరణకు దారితీస్తుంది. ఈ కేవైసీ కోసం ఇతరుల ఆధార్ నంబర్లను ఉపయోగించకూడదని, మరిన్ని వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : - 9640407866 & 8341441763.

# సబ్జెక్టు మార్పుపై అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ

**- విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం : ఆర్‌జేడీ అజ్మీర గోపాల్**

**- 56 మంది అధ్యాపకులకు ఓరియంటేషన్.. 8 మంది జిల్లా రిసోర్స్ పర్సన్స్‌గా ఎంపిక**



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 12 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సబ్జెక్టు మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు తమ బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల రీజినల్ జాయింట్ డైరెక్టర్ అజ్మీర గోపాల్ సూచించారు. విద్యార్థులకు మారుతున్న విద్యా అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ విద్యాశాఖ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సబ్జెక్టు మార్పుపై అధ్యాపకులకు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ అజ్మీర గోపాల్ పాల్గొని అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్ రావు శిక్షణకు సంబంధించిన అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.

**- 56 మంది అధ్యాపకులకు ఓరియంటేషన్**

ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఎకనామిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, గణిత శాస్త్రం సబ్జెక్టులకు చెందిన మొత్తం 56 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. సబ్జెక్టు మార్పుల నేపథ్యంలో అధ్యాపకులకు ఆయా కొత్త సబ్జెక్టులపై ప్రాథమిక అవగాహనతో పాటు బోధనా పద్ధతులు, సిలబస్, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించే విధానాలపై శిక్షణ అందించారు.

**- 8 మంది జిల్లా రిసోర్స్ పర్సన్స్‌గా ఎంపిక**

శిక్షణలో పాల్గొన్న వారిలో ప్రతిభ, బోధనా నైపుణ్యాల ఆధారంగా 8 మందిని జిల్లా రిసోర్స్ పర్సన్స్‌గా ఎంపిక చేశారు. వీరికి సబ్జెక్టు మార్పుపై ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు, భవిష్యత్తులో జిల్లాలోని ఇతర అధ్యాపకులకు అవసరమైన శిక్షణ అందించే బాధ్యతలను అప్పగించనున్నారు. సబ్జెక్టు మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు కొత్త సబ్జెక్టులపై పూర్తి స్థాయి అవగాహన, నైపుణ్యం సాధించేలా చేయడమే ఈ ఓరియంటేషన్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. శిక్షణ పొందిన జిల్లా రిసోర్స్ పర్సన్స్ ద్వారా మిగిలిన అధ్యాపకులకు కూడా దశలవారీగా శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకులకు అందించే ఈ శిక్షణ ద్వారా బోధనా సామర్థ్యం మరింత మెరుగుపడి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

# అభివృద్ధి పనుల సమీక్షా సమావేశం

**- అధికారులకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ దిశా నిర్దేశం......**



శేరిలింగంపల్లి.ఆగస్టు 11: (ఃవిజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ (IAS) ఆధ్వర్యంలో ఈరోజు డిప్యూటీ కమిషనర్లు మరియు ఇంజనీరింగ్ అధికారులతో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, "వన్ డే – వన్ వార్డ్" (One Day One Ward) కార్యక్రమం పురోగతిపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన కొత్త పనుల ప్రతిపాదనలు, మరియు ప్రస్తుతం కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో డిప్యూటీ కమిషనర్లతో పూర్తి సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ నాణ్యతతో పూర్తి కావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అందరూ డిప్యూటీ కమిషనర్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 11,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘ అధ్యక్షురాలికి సన్మానం




నిజామాబాద్ ఆగస్టు 11:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ సోమవారం రోజు సీనియర్ సిటిజన్స్ ఫోరం నిజామాబాద్ లో కార్యవర్గ సభ్యులైన గుజ్జ రాజేశ్వరి కి ఇటీవల జరిగిన చేనేత సహకార అధ్యక్షురాలిగా ఎన్నికైన సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించడం జరిగింది. సందర్భంగా అధ్యక్షులు కాటిపల్లి నారాయణ రెడ్డి శాలువాతో, కార్యదర్శి డా.వంగ విజయ కుమార్ బొకే సమర్పించి ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు వారిని సీనియర్ సిటిజన్స్ ఫోరంనకు సేవలతో పాటు సహాయ సహకారాలు అందచేయాలని కోరడమైనది. వారు కూడా సహృధ్భావంతో సేవలు చేయగలనని విన్నవించారు. ఈ కార్యక్రమంలోకార్యవర్గ సభ్యులైన టి.భూమన్న,నల్లా రాజారెడ్డి, దొంతి లక్ష్మారెడ్డి, కర్ణం వెంకట రెడ్డి. శ్రీరాములు, లింగయ్య, భూమయ్య, రవీంద్రనాథ్, గుజరాతీ రాజేశ్వర్, రంగయ్య, సిద్దిరాములు, సత్యనారాయణ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు అపన్నహస్తం కోసం ఎదురుచూపు



నిజామాబాద్ ఆగస్టు11:( విజన్ ఆంధ్ర) : బాదావత్ భగవాన్ నాయక్ 2001వ సంవత్సరంలో తెలంగాణ రైతు కార్మిక పార్టీని స్థాపించి 2005 నుండి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాల్లో అనేక ర్యాలీలో నిరసనల్లో పాల్గొని ఆందోళనలు చేస్తున్న సమయంలో అనేకసార్లు జైలుకు వెళ్లడం జరిగింది తెలంగాణ సాధన కోసం మూడుసార్లు ఎంపి గా ఐదుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ఉద్యమం కాలంలోనే ఆయన యొక్క సొంత ఇల్లు వ్యక్తిగతంగా 50 కోట్లకు పైగా నష్టపోయిన మొక్కవోని దీక్షతో ధైర్యంగా ఉద్యమంలో పాల్గొన్న 1995 నుండి 2004 వరకు సిరికొండ మండలం తుంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా బాధ్యతలు కూడా నిర్వహించారు. ఆయనకు రెండు కిడ్నీలు చెడిపోవడంతో 2021 లో ఈ విషయం నిర్ధారణ అయింది అప్పటినుండి ఇప్పటివరకు రోజు ఒకసారి డయాలసిస్ చేయించుకుంటూ జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడి కిడ్నీ మార్పిడి అవసరం ఉండడంతో నిమ్స్ ఆస్పత్రిలో జీవనాధార పథకం ద్వారా అప్లికేషన్ ఇవ్వడం జరిగిందని కానీ వారు ఐదు సంవత్సరాల వరకు వెయిటింగ్ లో ఉందని తెలిపా రు ప్రైవేటు ఆస్పత్రుల్లో అడిగితే కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ కి రెండు కోట్ల యాభై లక్షల రూపాయల వరకు ఖర్చు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకోవడానికి అవసరమైన ఆర్థిక వనరులు లేకపోవడం వల్ల కిడ్నీ దాతలు ముందుకు రావాలని సాధ్యమైనంత మట్టు కు ఆన్ చేయా లంటే విలేకరుల సమావేశం ద్వారా ప్రజలను కోరారు ఫోన్ పే నెంబర్ 93965 27330 అకౌంట్ నెంబర్ 306 7787 1689 ఐ ఎఫ్ ఎస్ సి కోడ్ ాదీ×చీ0009789 ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ధన్ పాల్ పరామర్శ



నిజామాబాద్ ఆగస్టు11: (విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ మంగళవారంఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద ఇటీవల మృతి చెందిన యువకుడు అజీమ్ కుటుంబ సభ్యులను అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. ఆటో నగర్ లోని వారి ఇంటికి వెళ్ళి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబానికి ఆసరాగా నిలిచిన నవయువకుడు మృతి చెందడం బాధాకరమన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద ఇరిగేషన్ శాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం, లోతట్టు ప్రాంతాలకు అనుమతించకపోవడం చేయాలన్నారు. ఈ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అలాగే బాధిత కుటుంబాలకు తన వంతు సహకారం ఉంటుంది అన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు కైసర్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, రాము, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తుల తయారీ వేగవంతం చేయాలి

**- అర్హులైన వారందరికీ చేయూత పెన్షన్లు**

**- గూగుల్ మీట్ ద్వారా జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఇచ్చేందుకు కుట్టిస్తున్న ఏకరూప దుస్తుల తయారీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్ నుంచి చేయూత పెన్షన్లు, సెన్సెస్, ఎస్ఐఆర్, ఏకరూప దుస్తుల తయారీ, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యార్థులకు రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులను ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే ఒక జత బట్టలను పంపించడం జరిగిందని, ఇంకో జతను ఈనెల చివరి వరకు అందజేయాలన్నారు. ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆగస్టు 20వ తేదీలోగా యూనిఫామ్స్ అందించేలా తయారీ ప్రక్రియ వేగవంతం కావాలని ఆదేశించారు. జనాభా గణనలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ తయారీకి అన్ని గ్రామాలలో సదుపాయాలు, ఇతర సమగ్ర వివరాలను సంబంధిత జిపిఓలు పకడ్బందీగా సేకరించాలన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే పూర్తయినందున ఎన్యుమరేషన్ పత్రాలను ఫిలప్ చేసి ఇచ్చిన వారి వివరాలను డిజిటలైజేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ఆగస్టు 17 లోపు ఎవరైనా ఎనిమరేషన్ పత్రాలను పూరించి తిరిగి ఇస్తే వారి వివరాలను డ్రాఫ్ట్ పబ్లికేషన్లో ప్రచురించడానికి అవకాశం ఉందన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం చేయూత పెన్షన్లను ఇస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**- హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపుపై అధికారులతో కలెక్టర్ భవేష్ మిశ్రా సమీక్ష**

నిజామాబాద్, ఆగస్టు 11 :(విజన్ ఆంధ్ర )భూగర్భ జలాలను పెంపొందించేందుకు, వర్షపు నీటిని నిలువ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న ప్రస్తుత తరుణంలో జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ తదితర నిర్మాణాలు జరిపించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం జలసిరి, హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ఫాంపాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు జరగని మండలాల ఎంపీడీఓ లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో రైతులను, ప్రజలను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిని సరెండర్ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం జీతాల కోసం పని చేయకూడదని, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును వృధా కాకుండా కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యతను గుర్తెరిగి అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నైరుతీ రుతుపవనాలు మొట్టమొదటగా ప్రవేశించే కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా సాధారణంతో పోలిస్తే 44 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉందని అన్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నీటి సంరక్షణకు ఉపయుక్తంగా నిలిచే ఫాంపాండ్స్, సోక్ పిట్స్ వంటి వాటిని విరివిగా నిర్మించేలా చూడాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయి నీరు అందించక వృధాగా ఉన్న బోరు బావుల వద్ద వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. తమిళనాడులోని తిరువల్లూరు జిల్లాలో వీటి నిర్మాణాల వల్ల 5 నుండి 10 అడుగుల మేరకు భూగర్భ జలాల వృద్ధి చెందాయని, ఇక్కడ కూడా అలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. కాగా, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలు నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన మొక్కలను ఈ నెల 29న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటకుండా తప్పుడు నివేదికలు సమర్పించిన వారి నుండి నిధుల రికవరీ చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతిని సమీక్షిస్తూ, సెప్టెంబర్ 15లోపు పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని గడువు విధించారు. జాబ్ కార్డులు కలిగి ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు వీబీజీరాంజీ కింద వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుండి కేటాయించబడే నిధులు పూర్తిస్థాయిలో వినియోగం అయ్యేలా చొరవ చూపాలన్నారు. గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసేందుకు లబ్దిదారుల జాబితా రూపొందించాలని, రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికి కేటాయించేందుకు వీలుగా లబ్దిదారుల జాబితాను తక్షణమే తహసిల్దార్లకు సమర్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఫాంపాండ్స్, సోక్ పిట్ల నిర్మాణాలు చేపట్టేలా, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులను, ప్రజలను అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్ ఈ.ఈలు, ఏ.ఈలు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా జక్రాన్ పల్లి గ్రామాలలో 25 సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**- ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానం**

**- సైబర్ నేరాల నియంత్రణ మరియు డ్రగ్స్ నియంత్రణ లో ప్రజలు అప్రమంతముగా ఉండవలెను**



నిజామాబాద్ ఆగస్టు11:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ రూరల్ మంగళవారం ఈరోజు సాయంత్రం సమయంలో జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ లో లిమన ఊరు మన భద్రత మన బాధ్యతలి కార్యక్రమంలో భాగంగా 25 సీసీ కెమెరాలను లిగౌరవనీయులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్.,ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని , సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని , సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని , నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు వారి భద్రత కోసం సి సి కెమెరా లను పెట్టాలని చెప్పారు. ఇది వారి భాద్యత గా తీసుకోవాలి. దుకాణాల యజమానులు తప్పనిసరిగా సి. సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జక్రాన్ పల్లి గ్రామంలో 25 సి.సి కెమెరాలు పెట్టి సహకరించిన గ్రామ పంచాయతీ ను పోలీస్ కమీషనర్ అభినందించారు. ఈ సందర్భంగా శజక్రాన్ పల్లి గ్రామశీలో డ్రగ్స్ నివారణ , సైబర్ నేరాల పట్ల అవగాహన , రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం అన్నీ రకాల జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాదు ఎ.సి.పి శ్రీ ప్రకాష్ , సి.సి.ఆర్.బి ఎ.సి.పి శ్రీ గురు నాయుడు , డిచ్పల్లి సిఐ శ్రీ తిరుపతి జక్రాన్ పల్లి ఎస్ఐ శ్రీ మహేష్ గ్రామ సర్పంచ్ శ్రీ బండి పద్మసత్యం మండల అధ్యక్షులు శ్రీ రెక్కల సురేష్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# నేరాలపై ఉక్కుపాదం.. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యం

**- డయల్ 112 అత్యవసర సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి**

**- మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



గద్వాల ఆగస్టు 11( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో నేరాల నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు చట్టపరంగా శిక్ష పడేలా, బాధితులకు సత్వర న్యాయం అందేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలను ఎస్పీ సమీక్షించారు.సీసీటీఎన్ఎస్ (2.0)ను సమర్థవంతంగా వినియోగించాలని, ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న టూల్స్, ఫీచర్లను పూర్తిస్థాయిలో వినియోగించి పోలీసింగ్‌లో పారదర్శకత, వేగం, సేవల నాణ్యతను పెంచాలని ఆదేశించారు.సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, అక్రమ ఇసుక, గంజాయి రవాణా,పిడిఎస్. రైస్, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయంతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిర్వహణను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.డయల్ 100 స్థానంలో కొత్తగా లాంచ్ చేసినటువంటి డయల్ 112 అత్యవసర సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచిస్తూ, అత్యవసర సమయంలో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలను వేగంగా పొందేందుకు డయల్112 ను వినియోగించుకునేలా ప్రజలకు తెలియజేయాలని అన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగం ద్వారా ప్రాపర్టీ నేరాల నియంత్రణతో పాటు నేరాల ఛేదన మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సామాజిక సమస్యలను గుర్తించడంతో పాటు ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్ గారు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పనకు ఖచ్చితమైన సమాచారం అందించాలి

**- అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం**

నిజామాబాద్, ఆగస్టు 11 :(విజన్ ఆంధ్ర )జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీ.సీ.హెచ్.బీ) రూపకల్పన కోసం ఖచ్చితత్వంతో కూడిన నాణ్యమైన సమాచారం అందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో, ఆయా రంగాల ప్రముఖులతో జనగణన2027కు సంబంధించి జిల్లా స్థాయిలో రూపొందించే హ్యాండ్‌బుక్ కు అందించాల్సిన సమాచారం విషయమై చర్చించి సూచనలు చేశారు. విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, సమాచార వ్యవస్థ, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, చేతివృత్తులు, కళలు, సాహిత్యం, ప్రముఖ వ్యక్తులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, అటవీ ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, పరిశ్రమలు, పురావస్తు సంపద తదితర అంశాలకు సంబంధించిన జిల్లా సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించేలా చూడాలన్నారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రాబోయే పది సంవత్సరాల పాటు సమాచార సేకరణ, ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయుక్తమైన గ్రంథంగా నిలుస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సమాచార సేకరణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారం రోజులలో సంబంధిత శాఖలు సమాచారాన్ని సేకరించి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు తగిన సమాచారం అందించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 11,(విజన్ ఆంధ్ర); జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు శాఖల వారిగా సంబంధిత సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని జనాభా, అక్షరాస్యత, భౌగోళిక పరిస్థితులు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, వివిధ ప్రభుత్వ శాఖల వారీగా లభ్యమయ్యే సమాచారాన్ని అత్యంత ఖచ్చితత్వంతో సేకరించాలని చెప్పారు. భవిష్యత్తులో జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు, భౌగోళిక, సంస్కృతిక అంశాల్లో అభివృద్ధికి ఈ సెన్సస్ హ్యాండ్ బుక్ ప్రామాణికంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రణాళిక, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోగా నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. వివరాల సేకరణలో ఎలాంటి తప్పులకు తావు ఉండకూడదు అన్నారు. సేకరించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించిన తర్వాతే నివేదికలో పొందుపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపివో గంగారెడ్డి, ఆర్డీవో దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నేడు వనపర్తిలో సాగునీటి సలహా మండలి సమావేశం

**- ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజాప్రతినిధులు, అధికారుల హాజరు - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో బుధవారం సాగునీటి సలహా మండలి సమావేశం జరగనుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, దానిపై ఆధారపడిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై చర్చించనున్నారు. రాజీవ్ భీమా, జవహర్‌లాల్ నెహ్రూ, కోయిల్‌సాగర్, శ్రీశైలం, మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లిలకు సంబంధించిన సాగునీటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ శాఖ అధికారులు ఈ సమావేశానికి హాజరుకానున్నారని కలెక్టర్ వెల్లడించారు.

### పేదింటి ఆడపిల్లలకు అండ 'కల్యాణలక్ష్మిషాదీ ముబారక్' పథకం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఆగస్ట్ 11,(విజన్ ఆంధ్ర): పేదింటి ఆడపిల్లలకు 'కల్యాణలక్ష్మిషాదీ ముబారక్' పథకం ఆర్థిక అండగా నిలుస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మిషాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని తహసీల్దార్ సుజాత తో కలిసి లబ్ధి దారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడు తూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడ పిల్లల వివాహ సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మిషాదీ ముబా రక్ పథకం ఎంతో ఉపయోగ పడుతుందని అర్హులైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవా లని కోరారు. ఆడపిల్లల పెళ్ళి సమయంలో తల్లిదండ్రులపై వివాహ ఖర్చుల భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా సహాయ పడుతోం దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 22 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.22,02,552 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశామని ఎమ్మెల్యే చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నాచారం ఓయూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం..!



కాప్రా /ఆగస్టు 11(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : బదిలీపై వెళ్తున్న ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్‌ను, ఓ.యూ. ఏ.సీ.పి జగన్ తో కలిసి నాచారం ఓయూ ప్రెస్‌క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దాసు గణేష్, గౌరవ సలహాదారు నరసింహరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు విశ్వం గౌడ్, ఫణింద్రచారి తదితరులు మహేష్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఓయూ పరిధిలో విధులు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన సేవలను వారు కొనియాడారు. బదిలీ అనంతరం కూడా ప్రజలకు, పోలీసు శాఖకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఫిరోజ్, సభ్యులు తిరుమల్ రెడ్డి, హరీష్,జీవన్ రెడ్డి, జాఫర్, విజయ్, వెంకట్, జీవన్, రవి, శ్రవణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఎస్సీ ఎస్టీలకు“డా. అంబేద్కర్ వైద్య సహాయ పథకం“ ద్వారా వైద్య సహాయం

**- జిల్లా కలెక్టర్ మను చౌదరి,**




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యొక్క భావజాలం తత్వాన్ని ప్రచారం చేయడం, అలాగే డాక్టర్ అంబేద్కర్ జన్మ శతాబ్ది ఉత్సవాల కమిటీ సిఫార్సుల నుండి ఉద్భవించిన కీలక సంక్షేమ పథకాలను నిర్వహించడం లక్ష్యంగా ఏర్పాటైన డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించబడిన స్వయంప్రతిపత్తి గల సంస్థ జనవరి 2004 నుండి “డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకాన్ని“ అమలు చేస్తోందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సలు, కిడ్నీ, క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులతో సహా తీవ్రమైన ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న షెడ్యూల్డ్ కుల, షెడ్యూల్డ్ తెగ, వర్గాలకు చెందిన రోగులకు కీలకమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని, వీరి వార్షిక కుటుంబ ఆదాయం 5,00,000/- (ఐదు లక్షల రూపాయలు మాత్రమే) కంటే తక్కువగా ఉండాలని, వ్యాధుల వారీగా గరిష్ట పరిమితి మొత్తం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయని. గుండె శస్త్రచికిత్స – వ్యాధి రూ. 1.50 లక్షలు, మూత్రపిండాల శస్త్రచికిత్స/డయాలసిస్ – రూ. 3.50 లక్షలు క్యాన్సర్/శస్త్రచికిత్స/కీమోథెరపీ/రేడియోథెరపీ – రూ. 2.50 లక్షలు, బ్రెయిన్ సర్జరీ – రూ. 2.00 లక్షలు, మూత్రపిండం/అవయవ మార్పిడి – రూ. 3.50 లక్షలు, వెన్నెముక శస్త్రచికిత్స – రూ. 1.50 లక్షలు, ఇతర ప్రాణాంతక వ్యాధులు గరిష్ట పరిమితి (రూ.) రూ. 2.00 లక్షలు, ఈ సంక్షేమ పథకం యొక్క పరిధిని, ప్రభావాన్ని విస్తృతం చేయడానికి, “డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకం“ను 2026లో సమగ్రంగా సవరించడం జరిగిందని, ఈ సవరణలు అర్హత గల వ్యాధుల పరిధిని, ఎంప్యానెల్డ్ ఆసుపత్రులను విస్తరిస్తాయని అర్హులైన అభ్యర్థులు పోస్ట్ ద్వారా వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులను నిర్దేశించిన దరఖాస్తు ఫార్మాట్‌లో (ముద్రిత రూపంలో గానీ లేదా నిర్దేశించిన ప్రోఫార్మా ప్రకారం సాదా కాగితంపై ముసాయిదా రూపంలో గానీ) సమర్పించాలని, దరఖాస్తు మార్గదర్శకాలు, ఫారమ్‌లు మరిన్ని వివరాలు అధికారిక డి ఏ ఎఫ్, వెబ్‌సైట్ dosje.gov.in సంప్రదించవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు.

## మాట నిలబెట్టుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**- అంజనగిరి పాఠశాల విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డింపు**





వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : వనపర్తి మండలం అంజనగిరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన మాటను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిలబెట్టుకున్నారు. ‘సార్‘ కార్యక్రమంలో భాగంగా గతంలో పాఠశాలను సందర్శించి పాఠాలు బోధించిన ఆయన, విద్యార్థులకు స్వయంగా భోజనం ఏర్పాటు చేసి వడ్డిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు మంగళవారం పాఠశాలలో ప్రత్యేకంగా భోజనం తయారు చేయించి విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. అనంతరం విద్యార్థులకు అరటిపండ్లు, చాక్లెట్లు పంపిణీ చేసి సరదాగా ముచ్చటించారు.

**- రైతులను, ఉపాధ్యాయులను గౌరవించాలి**

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో కేవలం విద్యే కాకుండా క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విద్యాసంస్థలను తరచూ సందర్శించి మౌలిక వసతులు, భోజన నాణ్యతపై దృష్టి సారించాలన్నారు. ఆహారాన్ని అందించే రైతులు, రైతుకూలీల విశిష్టతను విద్యార్థులకు వివరించి.. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను, రైతులను గౌరవించాలని ఉద్బోధించారు.మాజీ మంత్రి చొరవ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నందిమల్ల అశోక్, కె.మాణిక్యం, సర్పంచ్ నేనావత్ శాంతమ్మ దేవకుమార్, రఘువర్ధన్ రెడ్డి, ధర్మా నాయక్, రవిప్రకాష్ రెడ్డి, మాధవ్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

**- వాహనదారులకు జాతీయ జెండాల పంపిణీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా కన్వీనర్ బచ్చు రాము ఆధ్వర్యంలో వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ప్రధాన రహదారి కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు దుప్పల్లి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అటుగా వెళ్లే వాహనదారులకు త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబీరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న, ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బొసెట్టి శ్రీనివాసులు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అలివేలమ్మ, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సామాజికవేత్త పొడిశెట్టి నారాయణస్వామి కన్నుమూత

**- మంత్రి సీతక్క పరామర్శ.. కుటుంబానికి మనోధైర్యం**



ములుగు, ఆగస్టు 11: ములుగు ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు లిపొడిశెట్టి నారాయణస్వామిలి (95) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి 9 గంటలకు తుదిశ్వాస విడిచారు.

మంత్రి సీతక్క పరామర్శ

నారాయణస్వామి గారి మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి లిసీతక్కలి ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. నారాయణస్వామి గారితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మంత్రి సీతక్క, చిన్ననాటి పాఠశాల రోజుల్లో ఆయన తనకు పాఠశాల యూనిఫారాలు కుట్టి ఇచ్చేవారని తెలిపారు. అంతేకాకుండా చిన్ననాటి నుంచే పిల్లలు పొదుపు నేర్చుకోవాలని ఆయన ‘సుధాకర్ చిన్న పిల్లల పొదుపు పథకం‘ పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించారని, తాను ఆ పథకానికి సభ్యురాలినని గుర్తు చేసుకున్నారు. ఆయన ‘అమేజింగ్ తెలంగాణ‘ ఎడిటర్ రమేష్ కుమార్ గారి తండ్రిలి కావడం గమనార్హం. ఆయన మృతి వార్త తెలియగానే ములుగు ప్రాంత ప్రజలు, అభిమానులు, సామాజిక సేవా రంగానికి చెందిన పలువురు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు.

సుదీర్ఘ సామాజిక సేవ

నారాయణస్వామి ములుగు ప్రాంతంలో సుదీర్ఘకాలంగా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారు. నిరాడంబర జీవితం గడుపుతూ, తనకు చేతనైన రీతిలో సమాజానికి సేవ చేయడం ద్వారా స్థానిక ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆయన మరణం ములుగు ప్రాంతానికి తీరని లోటు అని పలువురు పేర్కొన్నారు. నారాయణస్వామి గారు గొప్ప మానవతావాది. సమాజం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయనతో నాకు ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనది. ఆయన మరణం వ్యక్తిగతంగా నాకు కూడా ఎంతో బాధ కలిగించింది“ అని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులుఈ కార్యక్రమంలో నారాయణస్వామి గారి కుమారులు సుధాకర్, ప్రభాకర్, రవీందర్, దిలీప్ కుమార్, రమేష్ కుమార్ తో పాటు బంధుమిత్రులు పాల్గొన్నారు. ములుగు ప్రాంతంలో సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేసిన పొడిశెట్టి నారాయణస్వామి గారి సేవలు, ఆయనతో తమకున్న అనుబంధాన్ని ప్రజలు చిరకాలం గుర్తు చేసుకుంటారని స్థానికులు అన్నారు.

## ములుగు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100% పూర్తి.

**- 2.09 లక్షల మంది ఓటర్ల డేటా డిజిటలైజ్ చేసిన అధికారులు.**

**- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు .**



ములుగు ఆగస్టు 11, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – ఎస్ఐఆర్ ప్రక్రియను ములుగు నియోజకవర్గంలో 100 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. జూన్ 25న ప్రారంభమైన ఈ ప్రక్రియలో తొలుత ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత జూలై 1 నుంచి ఆగస్టు 10 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఫారాలు సేకరించి, ఓటర్ల వివరాలను పరిశీలించి డిజిటలైజ్ చేశారు. ములుగు నియోజకవర్గంలో మొత్తం 2,36,970 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,09,128 మంది అంటే 88.25 శాతం మంది వివరాలను డిజిటలైజేషన్ పూర్తి చేశారు. మిగిలిన 27,842 మందిని అన్‌కలెక్టబుల్‌గా గుర్తించారు. వీరిలో 8,354 మంది మరణించగా, 4,015 మంది డబుల్ ఎంట్రీలు, 14,207 మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లగా, 1,219 మంది ఆచూకీ లభించలేదు. ఇది మొత్తం ఓటర్లలో 11.75 శాతం. డిజిటలైజ్ అయిన 88.25 శాతం, అన్‌కలెక్టబుల్ 11.75 శాతం కలిపితే మొత్తం ఎన్యూమరేషన్ 100 శాతం పూర్తయినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోపు ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఎస్ఐఆర్ పూర్తితో ములుగులో ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, కచ్చితంగా ఉండనుందని అధికారులు తెలిపారు.

## తెలంగాణ మాజీ బీసీ కమిషన్ చైర్మన్

**- డాక్టర్ వకుళాభరణంను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ**

**“ బీసీల కోసం మీరు చేసిన కృషి గొప్పది” అంటూ ప్రశంస**



శేరిలింగంపల్లి. ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర ప్రతినిధి శ్రీరంగం విజయ్ కుమార్) : తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు తన సతీమణి సుధాశ్రీతో కలిసి మంగళవారం పార్లమెంట్ భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో నరేంద్ర మోదీని కలిశారు. సుమారు పది నిమిషాలపాటు సాగిన భేటీలో తాను రచించిన ‘శ్రీ నరేంద్ర మోదీ భారత్‌ను విశ్వవేదికపై నిలిపిన మహానాయకుడు’ తెలుగుహిందీఇంగ్లీష్ త్రిభాషా గ్రంథం, ‘అంత్యోదయం నుండి వికసిత భారత్’ తెలుగు గ్రంథం, ‘జీఎస్టీ: సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం మరియు వికాస యాత్ర’ త్రిభాషా గ్రంథాలను ప్రధానమంత్రికి సమర్పించారు. గ్రంథాలను ఆసక్తిగా పరిశీలించిన ప్రధాని, “ఈ గ్రంథాల రచనలో మీరు యజ్ఞం చేశారు” అంటూ డాక్టర్ వకుళాభరణంను అభినందించారు. ఆయన వ్యక్తిగత వివరాలు, విద్యార్థి దశ నుండి బీసీ ఉద్యమాల్లో సాగించిన ప్రయాణం, బీసీ కమిషన్లలో సభ్యుడిగా, చైర్మన్‌గా అందించిన సేవలను అడిగి తెలుసుకున్నారు. “బీసీల కోసం మీరు చేసిన కృషి గొప్పది” అని ప్రశంసించారు. అత్యంత చిన్న సామాజిక వర్గం నుండి ప్రజాజీవితంలో డాక్టర్ వకుళాభరణం ఎదిగిన తీరును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. “మీ నిబద్ధతను పరిశీలించాను; కలిసి పనిచేద్దాం” అని పేర్కొంటూ, రచనా పరంపరను కొనసాగించాలని సూచించినట్లు డాక్టర్ వకుళాభరణం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ‘జీఎస్టీ: సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం మరియు వికాస యాత్ర’ గ్రంథాన్ని 2025 డిసెంబర్ 16న పార్లమెంట్ భవనంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆవిష్కరించగా, మిగిలిన రెండు గ్రంథాలను 2026 జూన్ 28న హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ అరుదైన అవకాశం ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, సహకరించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి డాక్టర్ వకుళాభరణం కృతజ్ఞతలు తెలిపారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో నరకం చూస్తున్న విద్యార్థినులు..!

**- మూడు రోజులుగా నీళ్లు లేవు.. క్లాస్‌రూమ్‌ల పక్కనే కంపుకొడుతున్న మురుగునీరు**

**- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ నాయకుడు కురువ చిన్న మల్లయ్య ధ్వజం**







చిన్నంబావి ఆగస్టు11:(విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) తీవ్ర సమస్యలతో నిలయంగా మారింది. మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్న మల్లయ్య పాఠశాలను సందర్శించి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత మూడు రోజులుగా బోరు మోటార్లు, స్టార్టర్లు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు 8 మరుగుదొడ్లకు సంబంధించిన డ్రైనేజీ పైపు పగిలిపోవడంతో మురుగునీరు నేరుగా క్లాస్‌రూమ్‌ల పక్కనే చేరుతోంది. నెలల తరబడి నిలిచిన ఈ డ్రైనేజీ నీటి వల్ల భరించలేని దుర్వాసన వస్తోందని, దోమలు, పాములు, తేళ్లతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని చిన్న మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సొంత మండలంలోనే పాఠశాలకు ఈ దుస్థితి రావడంపై మంత్రి జూపల్లి కృష్ణారావు, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి నీటి వసతిని, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింగరాజు బీసన్న, బీజేపీ నాయకులు పల్లె మద్దిలేటి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**- రక్త పరీక్షలు తప్పనిసరి చేయాలి**

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు, సిబ్బంది ఉన్నందున పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దమందడి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన గర్భిణుల రికార్డులు పరిశీలించారు. ప్రతి గర్భిణికి రక్తహీనత పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారికి మందులు, పోషకాహార సలహాలు అందించాలని సూచించారు. లేబర్ రూమ్‌ను పరిశీలించి ప్రసవాలకు వచ్చే గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు, పరిశుభ్రత ఉండాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా డెంగ్యూ, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులతో వచ్చే రోగులకు ఖచ్చితంగా రక్త పరీక్షలు చేయాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే ప్రమాదం

**- వరి బదులు ఆరుతడి, పామాయిల్ పంటలు వేసుకోవాలి**

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**




వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం పెరుగుతోందని, రాబోయే రెండు నెలల్లో వర్షాలు మరింత తగ్గే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. రైతులు ఆలోచించి ఆరుతడి, పామాయిల్, కూరగాయల పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. మంగళవారం పెద్దమందడి రైతు వేదికలో ‘రైతు నేస్తం’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నీళ్లు వస్తున్నాయని వరి నారు పోయవద్దని హెచ్చరించారు. గత ఏడాది ఇదే సమయానికి 100 సెం.మీ వర్షం పడగా ఈ ఏడాది 76 సెం.మీ మాత్రమే నమోదైందని, భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గాయని తెలిపారు. గత ఏడాది మండలంలో 22 వేల ఎకరాల్లో సాగు కాగా, 18 వేల ఎకరాల్లో వరి వేశారని చెప్పారు. ఈసారి వరికి సరిపడా నీరు ఉండే అవకాశం లేదన్నారు. వేరుసెనగ, మినుము, కూరగాయలు, పామాయిల్ వంటి ఆరుతడి పంటలకు మేలురకం విత్తనాలు అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు వెల్లడించారు. జిల్లా ఉద్యాన అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ పామాయిల్ సాగుకు భారీ సబ్సిడీ ఇస్తున్నారని, వరిలో 1 ఎకరాకు వాడే నీటితో 3 ఎకరాల పామాయిల్ సాగు చేయవచ్చని, ఎకరాకు 5-7 టన్నుల దిగుబడి, నెలకు లక్షల్లో ఆదాయం వస్తుందని చెప్పారు. కూరగాయల సాగుకు ఎకరాకు రూ.9600 సబ్సిడీ ఉందని తెలిపారు. రైతు వెంకటరెడ్డి మాట్లాడుతూ వరిపై బోనస్ ఉండటంతో రైతులు దానికే మొగ్గు చూపుతున్నారని, ఆరుతడి విత్తనాలతో పాటు వాటికీ బోనస్ ఇస్తే రైతులు మారుతారని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ పర్ణిత, సింగిల్ విండో చైర్మన్ సత్యారెడ్డి, సర్పంచ్ సూర్యగంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లకు దరఖాస్తులు

**- ఆగస్టు 31 వరకు అవకాశం**

ములుగు ఆగస్టు 11;విజన్ ఆంధ్ర ప్రతినిధి : చేయూత సామాజిక భద్రత పథకం కింద కొత్త పెన్షన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వ్యాధిగ్రస్తులు అర్హులు. అర్హత నిబంధనల్లో ఎలాంటి మార్పు లేదు. 2014-2018 మధ్య ఉన్న నిబంధనల ప్రకారమే మంజూరు చేస్తారు. ఇప్పటికే ప్రజాపాలన, ప్రజావాణిలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు లిఆగస్టు 31, 2026లి లోపు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేస్తారు. అర్హత పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ఆమోదంతో పెన్షన్లు మంజూరు చేస్తారు

### నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లలో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, ఎన్నికల ఉప తహసిల్దార్ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు తుర్కలపల్లిలో కాటమయ్య కిట్ల పంపిణీ

**- ముఖ్య అతిథిగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

చారకొండ,ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర ): చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నేడు సాయంత్రం 4 గంటలకు కాటమయ్య కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ సహదేవ్,ఉపసర్పంచ్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై,అర్హులైన లబ్ధిదారులకు తన చేతుల మీదుగా కాటమయ్య కిట్లను అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. గ్రామంలోని లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# అమీన్ పూర్ ఆనంద్‌నగర్‌లో ఘనంగా దుర్గామాత బోనం..!





కాప్రా/ఆగస్టు 10 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ): అమీన్ పూర్ ఆనంద్‌నగర్‌లో దుర్గామాత బోనం వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టు శిరీష తన కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా బోనం సిద్ధం చేసి దుర్గామాతకు సమర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలో బోనం సంప్రదాయానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. అమ్మవారికి నైవేద్యంగా అన్నం, పాలు, బెల్లం తదితర పదార్థాలతో బోనం తయారు చేసి భక్తిశ్రద్ధలతో సమర్పించడం ఆనవాయితీ. తమ కుటుంబాన్ని, సమాజాన్ని అమ్మవారు సుఖశాంతులతో కాపాడాలని, అందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం ప్రసాదించాలని కోరుతూ భక్తులు బోనం సమర్పిస్తారు. ఈ సందర్భంగా జర్నలిస్టు శిరీష కుటుంబ సభ్యులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి, బోనాన్ని అమ్మవారి సన్నిధిలో సమర్పించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని భక్తి గీతాలు, అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆనంద్‌నగర్‌లో పండుగ సందడి కనిపించింది. అమ్మవారికి బోనం సమర్పించడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాకుండా, భక్తుడు తన కృతజ్ఞతను, విశ్వాసాన్ని దైవానికి సమర్పించే పవిత్రమైన సంప్రదాయంగా భావిస్తారు. కుటుంబ సంక్షేమం, ప్రజల శ్రేయస్సు, గ్రామంప్రాంతంలో సుఖశాంతులు నెలకొనాలని కోరుతూ దుర్గామాతను ప్రార్థించారు. బోనం అనంతరం కుటుంబ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తులు అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. భక్తి, సంప్రదాయం, కుటుంబ ఆత్మీయత కలగలిసిన ఈ వేడుక ఆనంద్‌నగర్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# పేద ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ..!




కాప్రా/ఆగస్టు 11(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : అమెరికా కేంద్రంగా పేదప్రజలకు సేవలందిస్తున్న త్రైవ్ ఫర్ యూత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ కాప్రా సర్కిల్ అరుల్ కాలనీలోని బీబీసీ క్రైస్తవ ప్రార్థన మందిరంలో త్రైవ్ ఫర్ యూత్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రభేష్ ఎర్నేని ఆధ్వర్యంలో 15 పేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పేద మధ్యతరగతి ప్రజలు ఆహారం దొరక్క ఇబ్బందులు పడుతున్న సమయంలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో పేద ప్రజలకు సహాయం చేయాలని లక్ష్యంతో బియ్యం, నిత్యావసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేస్తూ పేద ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన చిన్నపిల్లలకు, విద్యార్థులకు పుస్తకాలు, యువతకోసం తాము ఆర్థిక సహాయంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైవ్ ఫర్ యూత్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రభేష్ ఎర్నేని, బీబీసీ మినిస్ట్రీస్ ఫాస్టర్ రవికుమార్, బీబీసీ సంఘ పెద్దలు ప్రవీణ్, చిట్టిబాబు, అనిల్, శ్యాంసన్, దీపిక, తదితరులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలనిర్మూలనకు విస్తృత తనిఖీలు.

ఊట్కూర్, ఆగస్టు 11 ( విజన్ ఆంధ్ర) మత్తు పదార్థాల నిర్మూలనకు విస్తృత తనిఖీలు చేపడుతున్నామని ఊట్కూర్ ఎస్సై రమేష్ అన్నారు. మంగళవారం నారాయణపేట ఎస్పీ ఆదేశాల మేరకు మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఊట్కూర్,మండల కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీంతో ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బస్ స్టాండ్ పాన్ షాపులు, కిరణం, కొరియర్ తదితర ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ తనిఖీల్లో ఏఎస్ఐ తిమ్మారెడ్డి, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం..

**- 30 రోజుల పాటు శుభాల జాతర...**

**- తెలుగు రాష్ట్రాల్లో పెళ్లిళ్ల సందడి...**





ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 11: ఎదురుచూపులకు తెరపడింది. నేటి నుంచి అంటే ఆగస్ట్ 13 బుధవారం నుంచి శ్రావణ మాసం మొదలైంది. వినాయక చవితి వరకు సెప్టెంబర్ 11 వరకు దాదాపు నెల రోజుల పాటు వరుసగా మంచి ముహూర్తాలు ఉండటంతో తెలుగు రాష్ట్రాలు ఇప్పటి నుంచే పెళ్లి సందడితో కళకళలాడుతున్నాయి. ఈ ఒక్క మాసంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో 10 వేలకు పైగా పెళ్లిళ్లు జరగబోతున్నాయని అంచనా. ఆషాఢంలో ఖాళీగా ఉన్న ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ టీములు, ఫోటోగ్రాఫర్లు అందరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పల్లెటూళ్ల నుంచి నగరాల వరకు ప్రతి వీధిలో నేటి నుంచే మంగళవాయిద్యాల మోత వినిపిస్తోంది. ధరలు ఆకాశాన్ని తాకుతున్నా పెళ్లి అంటే ఆగదు కదా. 10 గ్రాముల బంగారం లక్షన్నర దాటినా ఆభరణాల షాపుల్లో రద్దీ తగ్గడం లేదు. వధువు కోసం పట్టుచీరలు, కుటుంబం మొత్తానికి కొత్త బట్టలతో వస్త్ర దుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి. కడియం నుంచి బెంగళూరు నుంచి ప్రత్యేక పూలు తెప్పించి మండపాలను అలంకరిస్తున్నారు. సాధారణ మధ్యతరగతి పెళ్లికే డెకరేషన్ కి 2 లక్షలు, పెద్ద పెళ్లిళ్లకు 10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక పెళ్లి అంటే కేవలం రెండు కుటుంబాల కలయిక మాత్రమే కాదు. దాని చుట్టూ బంగారం వ్యాపారి, చీరల షాపు, పూలవాడు, వంటవాడు, సర్వర్, డెకరేటర్, ఫోటోగ్రాఫర్, డ్రోన్ ఆపరేటర్, మేకప్ ఆర్టిస్ట్ ఇలా 20కి పైగా వృత్తులు ఆధారపడి ఉంటాయి. అందుకే ఈ శ్రావణ మాసాన్ని వ్యాపార వర్గాలు “ఉపాధి కల్పించే సీజన్“ అని పిలుస్తున్నారు. ఈ 30 రోజుల్లో లక్షల మందికి పని దొరకనుంది. పెళ్లి అనుబంధ వ్యాపారాలన్నీ కలిపితే 500 కోట్లకు పైగా టర్నోవర్ వస్తుందని అంచనా.

### శ్రావణంలో ప్రత్యేకం ఏంటంటే

పెళ్లిళ్లతో పాటు ఈ మాసంలో శివాలయాల్లో ప్రత్యేక పూజలు, సోమవార వ్రతాలు, వరలక్ష్మీ వ్రతం లాంటి పండుగలు కూడా ఉంటాయి. అందుకే గృహప్రవేశాలు, కొత్త వ్యాపారాలు, వాహనాలు కొనడం కూడా ఈ ముహూర్తాల్లోనే ఎక్కువగా చేస్తుంటారు. “ఈ రోజు చేస్తే మంచిది“ అనే నమ్మకంతో ప్రజలు ఈ తేదీలనే ఎంచుకుంటారు. అందుకే పండితుల దగ్గర నుంచి ఈవెంట్ మేనేజర్ వరకు అందరి ఫోన్లు నేటి నుంచే మోగుతున్నాయి. మొత్తంగా చెప్పాలంటే నేటి నుంచి మొదలైన ఈ శుభమాసం తెలుగు ఇంటింటా సంతోషాన్ని నింపడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా పెద్ద బూస్ట్ ఇవ్వనుంది.

# పట్టాల పేరుతో వసూళ్ల దందా..!

**- రెండో రకం పట్టాలంటూ ప్రజలకు ఎరవేత..?**

**- ఇంటి నంబర్ ఇప్పిస్తామంటూ డబ్బులు డిమాండ్**


**-పేదల ఆశలను ఆసరాగా చేసుకుని దందా..?**

**- మధ్యవర్తుల చేతుల్లో ప్రభుత్వ పథకం..?**

**- హౌసింగ్,మున్సిపల్ రెవెన్యూ అధికారులతో ప్లాట్ల దళారీ కుమ్మక్కు..?**

**- ఫోన్ పే లావాదేవీల పై విచారణ ఎప్పుడు..?**






సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 11:(విజన్ ఆంధ్ర) : పట్టాలు, ఇంటి నంబర్ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు సూర్యాపేట పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. మున్సిపల్ రెవెన్యూ ఉద్యోగి, ఒక ప్లాట్ల దళారీ కుమ్మక్కై ప్రజలకు పట్టాలు ఇప్పిస్తామని, ఇంటి నంబర్లు మంజూరు చేయిస్తామని చెప్పి పెద్ద మొత్తంలో ఫోన్ పే రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పట్టాల పేరుతో వసూళ్లు..?

ఇందిరమ్మ ఇంటి పట్టాలు, ఇంటి నంబర్ల విషయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే ప్రక్రియను తమ పరిచయాల ద్వారా సులభంగా పూర్తి చేయిస్తామని నమ్మబలికి కొంతమంది ప్రజల నుంచి నగదు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టా ఇప్పిస్తామని, ఇంటి నంబర్ మంజూరు చేయిస్తామని చెప్పి డబ్బులు తీసుకుంటున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

### అధికారుల పేర్లు చెప్పి..?

ప్లాట్ల దళారీ సంబంధిత అధికారులతో తనకు పరిచయాలు ఉన్నాయని చెబుతూ ప్రజలను నమ్మిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. హౌసింగ్,మున్సిపల్ రెవెన్యూ విభాగాల్లోని అధికారుల పేర్లు ప్రస్తావిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నిజానిజాలు తేల్చాలి


ఈ వ్యవహారంలో నిజంగా ఎవరెవరి ప్రమేయం ఉంది..? ప్రజల నుంచి ఎంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారు..? పట్టాలు, ఇంటి నంబర్ల మంజూరులో నిబంధనలు పాటించారా..? అధికారుల ప్రమేయం ఉందా..? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

### ఆధారాలపై విచారణ

ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలు ఉంటే వాటిని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హౌసింగ్, మున్సిపల్ రెవెన్యూ ఉద్యోగి తో పాటు సంబంధిత ప్లాట్ల దళారీ వివరణను కూడా అధికారులు నమోదు చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు.

# “46 ఏళ్లుగా ఒకే వర్గం గుత్తాధిపత్యం... ఇప్పుడైనా బీసీ,ఎస్సీ, ఎస్టీ లకు అవకాశం దక్కెనా..?

**- కల్వకుర్తి పీఏసియస్ నామినేషన్లపై కాంగ్రెస్ నాయకుల ఆశలు..**



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 11: కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీఏసియస్ ఏర్పాటై దాదాపు 46 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒకే సామాజిక వర్గం చేతిలోనే అధికారం కొనసాగుతోందని స్థానిక కాంగ్రెస్ నాయకులు జోరుగా ఆరోపణలు చేస్తూ చర్చలు పెడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాన్ని నియమించేందుకు జీవో విడుదలైన నేపథ్యంలో, గతంలో ఎప్పుడూ అవకాశం దక్కని బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాల సీనియర్ నాయకులకు ఈసారి అవకాశం కల్పించాలని కల్వకుర్తి మరియు ఊరుకొండ మండలాల బడుగు బలహీన వర్గాల కాంగ్రెస్ నాయకులు గట్టిగానే డిమాండ్ చేస్తున్నట్లు కనిపిస్తుంది.. “కాంగ్రెస్ పార్టీ అంటేనే సామాజిక న్యాయం అని,ఎన్నికల్లో బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని, అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తామని చెప్పే అధికారంలోకి వచ్చాం అని గుర్తు చేస్తూ కల్వకుర్తి పీఏసియస్ లో మాత్రం 46 ఏళ్లుగా ఒకే వర్గం గుత్తంగా పాలిస్తోంది“ అని నాయకులు మండిపడుతూ చర్చలు జరుపుతున్నారు. పార్టీ కోసం కష్టపడే మా వర్గాలకు పదవులు రావా అంటూ గట్టిగానే గర్జిస్తున్నట్లు తెలుస్తోంది. “ఈసారి నామినేషన్లలో బీసీ,ఎస్సి,ఎస్టీ , మైనార్టీలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి పాలకవర్గంలో చోటు కల్పించాలని లేకుంటే నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదు“ అని వారు హెచ్చరిస్తున్నారు. పిఎసియస్ లో రైతులందరికీ సమాన హక్కు ఉందని, కాబట్టి పాలకవర్గంలో కూడా అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం ఉండాలని వారు స్పష్టం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు, పార్టీ నాయకత్వం జోక్యం చేసుకొని సామాజిక న్యాయం చేయాలని కోరుకుంటున్నారు...

# దూప దీప నైవేద్య అర్చక సంఘం కమిటీ ప్రకటన

**- రాష్ట్ర సంఘంలో వనపర్తి జిల్లాకు మూడు కీలక పదవులు**



వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 11 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర దూప దీప నైవేద్య అర్చక సంఘంలో వనపర్తి జిల్లాకు చెందిన అర్చకులకు కీలక పదవులు దక్కాయి. ‘మన ఊరు మన గుడి మన అర్చకుడు’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాలెం గ్రామంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ పదవులను ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతాచార్యులును రాష్ట్ర అధికార ప్రతినిధిగా, జె. నటరాజస్వామిని సహాయ కార్యదర్శిగా, ఎం. రవీందర్ రావులిను ఉపాధ్యక్షుడిగా నియమించారు. కార్యక్రమంలో ఎం. బాలలింగయ్య, దిలీప్, నవీన్, లక్ష్మీకాంతరావు తదితర అర్చకులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ పెత్తనం

**- దర్శన మివ్వని సర్పంచ్**

**- సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**

**- అంబులెన్స్, జిమ్ జాడేది**



నిజామాబాద్ ఆగస్టు11:( విజన్ ఆంధ్ర) : బడా భీంగల్ ప్రజలను మభ్యపెట్టి ఎన్నో హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ఏ ఒక్కటి అమలు చేయకుండా సర్పంచ్ అందుబాటులో ఉండడం లేదని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాగుల గంగా మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బడా భీంగల్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాగుల గంగా మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి, గ్రామస్తుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాగుల గంగా మోహన్ మాట్లాడుతూ.. సర్పంచ్ గా గెలిచిన తరువాత స్థానికంగా ఉంటానని ప్రజలను నమ్మించి మోసం చేశారనీ, అలివి కానీ హామీలు ఇచ్చి, సర్పంచ్ అందుబాటులో ఉండడం లేదన్నారు. ఉప సర్పంచ్ పెత్తనం సాగించడం ఎంటనీ ప్రశ్నించారు. సొంత ఖర్చులతో అంబులెన్స్, జిమ్ ఏర్పాటు చేస్తానని ప్రధాన హామీగా ఇచ్చి, ఎందుకు అమలు చేయడం లేదన్నారు. సర్పంచ్ అందుబాటులో ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఎన్నికల్లో 24 గంటలు గ్రామంలోనే ఉంటూ సేవ చేస్తానని చెప్పడంతో నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, గెలిచిన తరువాత సర్పంచ్ భర్త ఉపసర్పంచ్ పెత్తనం చెలాయించడం ఏంటన్నారు. గ్రామస్తులకు సమస్యలు వస్తే సర్పంచ్ కు చెప్పుకుందామంటే కుర్చీ ఖాళీగా ఉంటుందని, మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. గెలిచిన సర్పంచ్ ప్రజలకు సేవ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ప్రజా సమస్యలు తీర్చాల్సింది పోయి ప్రైవేట్ పంచాయతీలకు అడ్డగా మార్చారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి, రాగుల లింబాద్రి, ఆకుల గంగాధర్, జంగం ప్రభు, రాగుల కిషన్, మాజీ ఎంపీటీసీ వల్లి, ముచ్కూర్ నరేష్, పల్లె మహిపాల్, సూల్ల భూమన్న, అయేటి రవీందర్, గురిజల రాజ గంగారం, దండు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED, AND OWNED BY J. NARENDER. PRINTED AT: SREE SESHASAI ENTERPRISES, 3-88, CHANDRA THEATRE MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151 AT J.N. PUBLICATION, 76-6-01, BHATS-ING ROAD, CHAITANYA APTS, NEAR SWATHI CENTER, BHAVANIPURAM, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH – 521137. RNI NO.: APTEL/26/A0313 EDITOR: J. NARENDER CELL NO.: 9440897445 EMAIL: visionandhra1999@gmail.com